ప్రజాశక్తి

గురువారం 12 జనవరి 2023 8 పేజీలు





గుంటూరు పల్నాడు

సచివాలయాల్లోనూ మామూలే

- అధికారుల నుంచి వ్యాపిస్తున్న అవినీతి మకిలి
- పలు ఘటనల్లో చిరు ఉద్యోగులే బలి

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో క్షేత్రస్థాయి సిబ్బందికి విధులు, బాధ్యతలు, పని విధానం నేర్పించాల్సిన వివిధ శాఖల అధికారులు ప్రజల నుంచి ఏ పనికి ఎంత వసూలు చేయాలో నేర్పుతున్నారు. కొత్తగా సచివాలయాల్లో గ్రామ, వార్డు పని చేస్తున్న వారు వివిధ పనుల కోసం వస్తున్న ప్రజల నుంచి గతంలో మండల, పట్టణ, జిల్లా స్థాయి కార్యాలయాల్లో ఏ విధంగా ఏ పనికి ఎంత తీసుకునేవారో ఇప్పుడు ఇదే రీతిలో సచివాలయాల ఉద్యోగులు వసూళ్లకు పాల్పడుతున్నారు. ప్రధానంగా రెవెన్యూ శాఖ ఇందులో కీలకంగా మారింది. గ్రామ, వార్డు సచివాలయాలు రాక ముందు తహశీల్దార్ల పరిధిలో పనిచేసే విఆర్‌వోలు ఏ విధంగా ప్రజలను ఇబ్బంది పెట్టేవారో ఇప్పుడు క్రమంగా సచివాలయాల్లో పనిచేసే వారు కూడా తయారువుతున్నారు. వీరి అవినీతిపై పట్టించుకునే వాడు లేకపోవడంతో ప్రభుత్వం రూపొందించిన సచివాలయాల వ్యవస్థ ఆశయానికి గండిపడుతోంది.

రెవెన్యూ పరంగా మ్యుటేషన్లు, పట్టాదారు పాసు పుస్తకాలు కోసం వచ్చే వారిని పలు సచివాలయాల్లోని విఆర్‌వోలు వేలాది రూపాయలు డిమాండ్ చేస్తున్నారు. ప్రధానంగా భూముల క్రయ విక్రయాలు, వారసులకు ఆస్తుల బదలాయించిన సందర్భంలో ఆన్‌లైన్‌లో యజమాని పేరు



గుంటూరులో గతంలో లంచం తీసుకుంటూ పట్టుబడిన సచివాలయం అడ్మిన్ సెక్రెటరీ

మార్చాల్సి ఉంటుంది. ఇందుకోసం వచ్చే వారిని ఉద్యోగులు ముప్పతిప్పలు పెడుతున్నారు. సొమ్ము ఇస్తే వెంటనే ఆన్‌లైన్‌లో మార్పు చేసి పాస్ పుస్తకాలకు దరఖాస్తులను ఆమోదిస్తారు. లేదంటో ఏదో ఒక సమస్య సృష్టించి నెలల తరబడి తిప్పడం పరిపాటైంది. తాము పై అధికారులకు, ప్రజా ప్రతినిధులకు ఇవ్వాలంటూ విఆర్‌వోలు పెద్ద మొత్తంలో డిమాండ్ చేస్తున్నారన్న విమర్శలు ప్రభలంగా ఉన్నాయి.

తాడికొండలో ఒక విఆర్‌వో ఇదే రీతిలో భర్త చనిపోయిన మహిళకు పాస్ పుస్తకం కోసం దరఖాస్తు చేసుకోగా ఏకంగా రూ.లక్ష డిమాండ్ చేశారు. దీంతో వారు స్థానిక వైసిపి నాయకులను ఆశ్రయించగా వారి ద్వారా రూ.20 వేలతో పని ముగించుకున్నట్టు తెలిసింది.

గుంటూరులోని ఏటి అగ్రహారం 89వ సచివాలయం పరిధిలో అపార్టుమెంట్ కొనుగోలు చేసిన వ్యక్తికి ఫ్లాట్‌నకు పేరు మార్పునకు అడ్మిన్ కార్యదర్శి రూ.5 వేలు డిమాండ్ చేయగా సంబంధిత వ్యక్తి ఎసిబిని ఆశ్రయించారు. రూ.5 వేలు లంచం తీసుకుంటుండగా అడ్మిన్ కార్యదర్శిని ఎసిబి అధికారులు పట్టుకున్నారు.

పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ అధికారులు ప్లాన్‌ల మంజూరు, పన్నుల నిర్ధారణ, ట్రేడ్‌లైసెన్సులకు సంబంధించి మునిసిపల్ శాఖ పరిధిలో పనిచేసే సెక్రటరీలను కూడా ప్రజల నుంచి ఎంత వసూలు చేయాలో దిశానిరేశం చేస్తున్నారు. అయితే ఎవరైనా ఫిర్యాదుచేసినా, శాఖపరంగా ఉన్నతాధికారుల నుంచి ఒత్తిడి వచ్చినా వెంటనే సచివాలయాల ఉద్యోగులను బలి చేసి ఆయా శాఖల అధికారులు తప్పించుకుంటున్నారు.

గుంటూరు-అమరావతి రోడ్డులో గత ఏడాది మార్చి 16న నిబంధనలకు విరుద్ధంగా

▶ 2లో



మండలంలో లబ్ధిదార్లతో కలిసి టిడ్కో ఇళ్ల వద్ద నిరసనలో సిహెచ్ బాబూరావు తదితరులు

టిడ్కో ఇళ్ల అప్పగింతలో తాత్సారం

- లబ్ధిదార్లకు అండగా పోరడతాం
- రాజధానిలో టిడ్కో ఇళ్ల పరిశీలనలో బాబూరావు

వార్త మెయిన్‌లో



సత్తెనపల్లిలో నిర్వహించిన రౌంట్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న గద్దె చలమయ్య

పార్టీలకే కాదు.. ప్రజలకూ ప్రమాదకరమే

- జీవో 1 పై వివిధ పార్టీలు, సంఘాల నాయకులు
- పలుచోట్ల రౌండ్‌టేబుల్ సమావేశాలు
- రద్దు చేసే వరకూ ఉద్యమాలకు తీర్మానాలు

8 లో

మంత్రి అంబటిపై కేసు నమోదుకు ఆదేశం

సత్తెనపల్లిలో లక్కిడ్రా పేరుతో వసూళ్లు - జనసేన ఫిర్యాదుతో కోర్టు ఉత్తర్వులు

వార్త మెయిన్‌లో

గుంటూరులో గాలి నాణ్యత అధ్వానం

- కాలుష్య నియంత్రణకు ప్రణాళికలు రూపొందించాలి
- ఎక్కువ కాలుష్యాన్ని విడుదల చేసే వాహనాలపై అపరాధ రుసుం
- సమీక్షలో గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరంలో గాలి నాణ్యతను పెంచేందుకు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం శాఖల వారీగా సూక్ష్మ ప్రణాళికలు రూపొందించి, అమలు చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో నగరంలో నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం (ఎన్‌సీఏపీ) నిధుల వినియోగం ఇంప్లీమెంటేషన్ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గుంటూరు నగరాన్ని కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి గాలి నాణ్యత అధ్వానంగా ఉందని గుర్తించినందున, గాలి నాణ్యత పెంచేందుకు నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

▶ 2లో

ధాన్యం అమ్మకంలో బాధలు పడలేకపోతున్నాం

- మట్టి, తేమ, తాలూ అంటూ ధర తగ్గిస్తున్నారు
- తేమ శాతంలోనూ రెండు చోట్లా తేడాలు
- రైతు సంఘం నాయకుల ఎదుట రైతుల ఆవేదన

ప్రజాశక్తి-తాడేపల్లి

ఆ మిల్లు దగ్గరకు వెళ్లండి.. ఈ మిల్లు దగ్గరకు వెళ్లండి.. మట్టి, తాలు ఉంది.. అంత ధర రాదు.. అనే రకరకాల సాకులతో ధాన్యం అమ్మకంలో తాము ఇబ్బందులు పడుతున్నామని, చేసేదేమీ లేక ప్రైవేటు వ్యాపారులకు పంటను తెగనమ్ముకుంటున్నామని రైతులు ఆవేదనకు గురయ్యారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలుపై పరిశీలనలో



కళ్లాల్లో ధాన్యాన్ని పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

భాగంగా రైతు సంఘం నాయకులు బుధవారం ఉండవల్లిలో పర్యటించి కళ్లాల్లోని ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా రైతులు తమ అవస్థలను వెళ్లబోసుకున్నారు. మబ్బులు కమ్మి వర్షం వస్తుందనే భయం ఒకవైపు, మంచు వల్ల ధాన్యం రంగు మారిపోతుందనే భయం మరోవైపు నెలకొని ఉండటంతో పట్టాలు కప్పి నానా అవస్థలు పడ్డామని తెలిపారు. రైతు భరోసా

▶ 2లో

సచివాలయాల్లోనూ 'మామూలే'

(మొదటి పేజీ తరువాయి)

బహుళంతస్తుల సముదాయం నిర్మించేందుకు తవ్వకాలు జరుపుతుండగా మట్టిపెళ్లలు విరిగి పడి ముగ్గురు మృతి చెందిన కేసులో తక్షణ చర్యగా సచివాలయం వార్డు ప్లానింగ్ సెక్రటరీని కమిషనర్ సస్పెండ్ చేశారు. సంబంధిత నిర్మాణ సంస్థకు సహకరించిన టౌన్ ప్లానింగ్ అధికారులంతా తమకేమీ సంబంధం లేదని తప్పుకున్నారు. వాస్తవంగా ఈ ఘటనలో టౌన్ ప్లానింగ్, నగరపాలక సంస్థలో అప్పటి కమిషనర్‌పై అవినీతి ఆరోపణలు రాగా ఎవరిపైనా ఎటువంటి చర్యలూ లేకుండానే ఈకేసు మూసేశారు. కానీ సచివాలయ ఉద్యోగికి తీవ్ర నష్టం జరిగింది.

వ్యవసాయ శాఖలో రైతు భరోసానిధుల దారిమళ్లిన ఘటనలో ఇప్పటికే పల్నాడు ప్రాంతంలో పలువురు సచివాలయాల ఉద్యోగులు కూడా సస్పెండ్ అయ్యారు. విఆర్‌వోలు, వ్యవసాయ, ఉద్యానవన సహాయకులు కూడా కౌలు రైతులు కాని వారికి సాగు ధ్రువీకరణ పత్రాలు ఇచ్చి రైతు భరోసా నిధుల స్వాహాలో పలువురు ఉద్యోగులు పాత్ర కూడా ఉంది. దీంతో తొలి దశలో తక్షణ వేటు సచివాలయాల ఉద్యోగులపై పడుతోంది. ఈ విషయాన్ని సచివాలయాల ఉద్యోగులు గుర్తించి సంబంధిత అంశాలపై జాగుకూరతతో వ్యవహరించాల్సి ఉంది.

గుంటూరులో గాలి నాణ్యత అధ్వానం

(మొదటి పేజీ తరువాయి)

ద్వారా నిధులు మంజూరు చేస్తుందన్నారు. దీనికోసం భారీ వాహనాలను నగరంలో నిర్దేశిత సమయంలోనే అనుమతించేలా రవాణా, పోలీస్ శాఖ పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. ట్రాఫిక్ సిగ్నల్ వద్ద వాహనాల ఇంజన్లు అపివేసేలా వాహనదారులకు అవగాహన కల్పించాలని, రహదారులపై ట్రాఫిక్‌జామ్ జరగకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. నిర్దేశిత స్థాయి కంటే ఎక్కువుగా కాలుష్యాన్ని విడుదల చేస్తున్న వాహనాలను తనిఖీ చేసి అపరాధ రుసుం విధించాలని ఆదేశించారు. గూడ్స్ వాహనాలపై టార్పాలిన్ పట్టాలతో కవర్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలో సీఎన్జీ, ఎలక్ట్రికల్ వాహనాలు వినియోగం పెంచేలా సంబంధిత శాఖలు చర్యలు తీసుకోవాలని సూచించారు. గాలిలో కాలుష్యాన్ని తగ్గించే చర్యలపై సూక్ష్మ ప్రణాళికల నివేదికలను శాఖల వారీగా వెంటనే రూపొందించి ప్రాణ పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని చెప్పారు. సమావేశంలో సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు శాస్త్రవేత్త ఎస్.కార్తికేయ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఏఈ శ్రీనివాసరావు, జిల్లా ఉప రవాణా కమిషనర్ కరీం, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజరు విజయరత్నం, జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎన్ వెంకటేశ్వర్లు, మైనింగ్, జిఎంసి అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం అమ్మకంలో బాధలు పడలేకపోతున్నాం

(మొదటి పేజీ తరువాయి)

కేంద్రాలకు వెళ్తే ఫలానా మిల్లు దగ్గరకే వెళ్లాలని చెబుతున్నారని, అంతదూరం వెళ్లలేకపోతున్నామని, వెళ్లినా ధాన్యంలో మట్టి గడ్డలు, తాలు ఉందంటూ తక్కువ ధరకు అడుగుతున్నారని వివరించారు. తేమ పేరుతో 75 కిలోల బస్తాకు కిలో తగ్గించాలని షరతు పెడుతున్నారని వాపోయారు. పైగా రైతు భరోసా కేంద్రంలో ఒకరకంగా, మిల్లర్ల వద్ద మరో రకంగా తేమశాతం చూపుతోందని తెలిపారు. ఈ బాధలన్నీ పడలేక ప్రైవేటు వ్యాపారులకు బస్తా రూ.1430కు కళ్లాల్లోనే పంటను అమ్ముతున్నామని తెలిపారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకరరావు మాట్లాడుతూ గోతాలను ప్రభుత్వమే సమకూర్చాలని, రైతులకు అభ్యంతరం లేకుండా మిల్లర్ వద్దకు రవాణా చేసి మద్దతు ధరకు ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. పరిశీలనలో రైతు సంఘం రాజధాని డివిజన్ అధ్యక్షులు ఈశ్వరరెడ్డి, ఉండవల్లి గ్రామ అధ్యక్షులు వీరాస్వామి, సిపిఎం తాడేపల్లి రూరల్ కార్యదర్శి డి.వెంకటరెడ్డి, టికె సంజీవరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థి హత్య కేసులో విచారణ

సంఘటన స్థలాన్ని పరిశీలించిన అడిషనల్ ఎస్పీ పులిపాటి అనిల్ కుమార్

ప్రజాశక్తి-మేడికొండూరు

మండలంలోని నరసరావుపేట రోడ్డులోని డోకిపర్రు యూనివర్సల్ కళాశాలలో పాలిటెక్నిక్ డిప్లమో మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి రావూరి చంద్రయ్య గత ఏడాది ఏప్రిల్‌లో హత్యకు గురయ్యాడు. ఈ కేసు విషయమై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ పులిపాటి అనిల్‌కుమార్ బుధవారం కళాశాల, సంఘటన ప్రదేశాన్ని పరిశీలించారు. కళాశాల అధ్యాపకులను, విద్యార్థులను, మృతుని తల్లి దండ్రులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. తొలుత సంఘటన ప్రదేశాన్ని మేడికొండూరు సిఐ ఆల్తాఫ్ హుస్సేన్,ఎస్సై కోటేశ్వరరావుతో కలిసి పరిశీలించిన అడిషనల్ ఎస్పీ, అనంతరం కళాశాలలో చంద్రయ్యతో కలిసి చదువుతున్న సహచర విద్యార్థులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. సంఘటన జరిగిన రోజు విద్యా ర్థులతో, స్నేహితులతో ఎలా మెదిగేవాడని, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అడిషనల్ ఎస్పీ వెంట పేరేచర్ల విఆర్వో మేడ వెంకట్రావు, డోకిపర్రు వీఆర్వో జోజప్ప ఉన్నారు.

నా కుమారుని కళాశాల అధ్యాపకులే చంపారు

మృతుని తల్లి రూతమ్మ ఆవేదన

కళాశాల అధ్యాపకులే తన కుమారుని చంపి రైలు పట్టాలపై వేశారని చంద్రయ్య తల్లి రూతమ్మ ఆరోపిస్తూ అడిషనల్ ఎస్పీ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. సంఘటన జరిగిన రోజు కళాశాల అధ్యాపకులు తమ మొబైల్‌ఫోన్‌కు తెలియపరచి పొంతనలేని సమాధానాలు చెప్పారని అన్నారు. 'నీ కుమారుడికి రోడ్డు ప్రమాదం జరిగిందని,రోడ్డు దాటుతుండగా కారు ఢీ కొట్టిందని.. మీరు గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రికి వెళ్ళండి' అంటూ తమను గుంటూరు,పేరేచర్ల, నరసరావుపేటలకు తిప్పారని తల్లి చెప్పారు. 'నా కుమారునికి ఏమైందని నేను గట్టిగా ప్రశ్నించడంతో.. నీ కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడు' అని కళాశాల వార్డెన్ తెలిపాడంటూ కన్నీటి పర్యంతమయ్యారు. కన్నీటి పర్వతమమైంది.10 నెలలు గడుస్తున్నా అధికారులు మారు తున్నారే గాని ఇంతవరకు కేసు దర్యాప్తులో ఎటువంటి పురోగతి లేదని, తమ కుమారుడి హత్య కేసుపై విచారణ వేగవంతం చేయాలని అడిషనల్ ఎస్పీను ఆమె వేడుకున్నారు.



విచారణలో పాల్గొన్న ఎఎస్ పి అనిల్ కుమార్, ఇన్‌సెట్‌లో విద్యార్థి తల్లిదండ్రులు

జిజిహెచ్‌లో నర్సుల ధర్నా

ఎఎన్ఎంలను స్టాఫ్ నర్సులుగా మార్చు తగదని నిరసన

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి: ఏఎన్ఎంలను స్టాఫ్ నర్సులుగా సర్దుబాటు నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని కోరుతూ గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట స్టాఫ్ నర్స్‌లు బుధవారం ధర్నా చేశారు. నర్సింగ్ కౌన్సిల్‌లో రిజిస్ట్రేషన్ ప్రక్రియలో నమోదు కాకుండా ఏఎన్ఎంలను స్టాఫ్ నర్సులుగా కేటాయించడం తగదని వారు పేర్కొన్నారు. ఏఎన్ఎంలు అత్యవసర కేంద్రాలలో పని చేయడానికి అర్హులు కారని, తాము గత పది ఏళ్ల నుంచి స్టాఫ్ నర్సులుగా విధులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇప్పటికి తమను రెగ్యులరైజ్ చేస్తామన్న హామీ నెరవేరలేదని ఈ నేపథ్యంలో ఎఎన్ఎంలను స్టాఫ్ నర్సులుగా నియమించడం తగదని పేర్కొన్నారు. నర్సింగ్ వ్యవస్థను పూర్తిగా నాశనం చేసే విధంగా ప్రభుత్వ నిర్ణయాలు ఉన్నాయన్నారు. ప్రభుత్వం తక్షణమే నిర్ణయం వెనక్కి తీసుకోకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. నర్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు స్వచ్ఛంద ప్రసాద్ మాట్లాడుతూ ఇప్పటికే పూర్తిగా నర్సింగ్ వ్యవస్థ దిగజారేలా రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాలు ఉన్నాయన్నారు. ప్రభుత్వం తక్షణమే నిర్ణయం వెనక్కి తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమం లో నర్సింగ్ నాయకులు మనీషా, శివమ్మ, సౌజన్య తదితర ఆసుపత్రి నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



జిజిహెచ్ ఎదుట ధర్నా చేస్తున్న స్టాఫ్‌నర్సులు

వర్సిటీలో పెన్షనర్లకు సత్కారం

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అధ్యాపకేతర పెన్షనర్ల సంఘం సర్వసభ్య సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆచార్య పి రాజశేఖర్ పాల్గొని ప్రసంగించారు. 70 సంవత్సరాలు పూర్తి చేసుకున్న పెన్షనర్లను ఈ సందర్భంగా విసీ చేతుల మీదుగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ పి వరప్రసాద్ మూర్తి, రిజిస్ట్రార్ బి కరుణ, సంఘ ప్రధాన కార్యదర్శి ఎం శివప్రసాద్, అధ్యక్షులు ఎం శాంతి శ్రీ, గౌరవ అధ్యక్షులు వి. మాణిక్యాలరావు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

1975-76 సంవత్సరంలో పదో తరగతి విద్యనభ్యసించిన రేవేంద్రపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు బుధవారం పెద్దవడ్లపూడిలో సమ్మేళనం అయ్యారు. మొత్తం 70 మంది పూర్వ విద్యార్థుల హజరై నాటి మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహక కమిటీ సభ్యులు మాదల రమేష్ బాబు, జీ. మధుసూదన్ ప్రసాద్, ఆలూరి వీరనారాయణ, లంక రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు కేలండర్‌తో శుభాకాంక్షలు

ప్రజాశక్తి-పెదనందిపాడు

ఉపాధ్యాయ విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం, విద్యారంగ పరిరక్షణకు ఎస్టియు చేస్తున్న సేవలు అభినందనీయమని పెదనందిపాడు తహశీల్దార్ షేక్ మహబూబ్ సుభాని పేర్కొన్నారు. రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం పెదనందిపాడు మండల శాఖ ఆధ్వర్యంలో బుధవారం పెదనందిపాడు తహశీల్దార్ షేక్ మహబూబ్ సుభానిని కలిసి ఎస్‌టియు డైరీ, నూతన సంవత్సర కేలండర్లను అందజేసి నూతన సంవత్సరం, ముందస్తు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. మండల విద్యాశాఖ అధికారి బి బాల సుబ్రమణ్యం, బి సుధారాణి, ఎస్టియు పెదనందిపాడు మండల శాఖ అధ్యక్షులు టి.వాసు, గుంటూరు జిల్లా అధ్యక్షులు గేరా మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి అంబటిపై తక్షణమే చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

సంక్రాంతి సంబరాల పేరిట నిషేధిత లాటరీ వ్యాపారం చేసి పేద ప్రజలను దోచుకుంటున్న మంత్రి అంబటి రాంబాబుపై తక్షణమే చర్యలు తీసుకోవాలని జిల్లా జనసేన పార్టీ అధికార ప్రతినిధి ఆళ్ళ హరి డిమాండ్ చేశారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ అంబటి రాంబాబు లాటరీ దందాపై పోలీసులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోర్టు ఉత్తర్వులు జారీ చేసే వరకు యంత్రాంగం స్పందించకపోవడం దారుణం అన్నారు.. వాలంటీర్ల సాయంతో సామాజిక పింఛన్ లబ్ధిదారులు ఎవరైతే ఉన్నారో వారితో బలవంతంగా లాటరీలను కొనేలా వత్తిడి చేస్తున్నారని,అలాంటివారు మంత్రి కావటం ప్రజలు చేసుకున్న దురదష్టకరమని అన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి- మేడికొండూరు

మండలంలోని అన్ని గ్రామాలలో ఈనెల 12వతేదిన గురువారం విద్యుత్ సరఫరా మర్మమతుల్లో భాగంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు మండల విద్యుత్ శాఖ అధికారి నాగరాజు తెలిపారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. . మండల ప్రజలు సహకరించవలసిందిగా కోరారు.

రైతులు పిఎం కిసాన్ ఇకెవైసి చేయించుకోవాలి

ప్రజాశక్తి-తెనాలి

రైతులు పిఎం కిసాన్ ఈ-కేవైసి తక్షణమే చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఎన్.వెంకటేశ్వర్లు చెప్పారు. బుధవారం మండల పరిధిలోని తేలప్రోలు, కంచర్లపాలెం, పట్టణంలోని రైతు భరోసా కేంద్రాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. రైతులు తమ పరిధిలోని రైతు భోరోసా కేంద్రాల్లో ఈ-క్రాప్ నమోదు చేయించుకోని రైతు భరోసా కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎరువుల లభ్యత పుష్కలమని, ఆర్బీకేల ద్వారా రైతులు పొందవచ్చునన్నారు. ఆయన వెంట ఏడీఏ కెవెంకటరావు, మండల వ్యవసాయాధికారి జి.ప్రేమ్‌సాగర్, ఏఈవో జి.మోహన్, ఆర్బీకే సిబ్బంది ఉన్నారు.

'ఆత్మకూరు ఆశా వర్కర్ పోస్టును రద్దు చేయాలి'

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి -తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి ఆత్మకూరు సచివాలయం -2 పరిధి ఆశా వర్కర్ పోస్టును రద్దు చేయాలని ఎంఆర్‌పిఎస్ రాజధాని కన్వీనర్ మల్లవరపు నాగయ్య మాదిగ అన్నారు. నగరంలోని ప్రెస్ క్లబ్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు సచివాలయం -2 పరిధిలో ఆశావర్కర్ పోస్టుకు మొత్తం 8మంది దరఖాస్తు చేసుకున్నారని, అయితే వారిలో మాదిగ కులానికి చెందిన మేకల రాణి కూడా దరఖాస్తు చేసుకుందని తెలిపారు. వితంతు మహిళకు ఆశా వర్కర్ల పోస్టు కేటాయింపులో ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉన్నా ఆ పోస్టును ఓసీ మహిళకు కేటాయించారని, ఆశా వర్కర్ పోస్టును స్థానిక వైసిపి నాయకులు డబ్బులకు అమ్ముకున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి చొరవ తీసుకుని వితంతు మహిళ మేకల రాణికి పోస్టు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని, లేకుంటే న్యాయపోరాటం చేస్తామని అన్నారు. ఈ సమావేశంలో బాధితురాలు మేకల రాణి, పి.మరియమ్మ, పులివర్తి నిరీక్షణ, వి. భాగ్యమ్మ, పి.నాగమణి పాల్గొన్నారు.



మెరుగైన సేవలందించేదకు రోటరీక్లబ్ కృషి

ప్రజాశక్తి -పొన్నూరు రూరల్

విద్య, వైద్య రంగాలలో మెరుగైన సేవలు అందించేందుకు రోటరీ క్లబ్ పనిచేస్తున్నదని 3150 డిస్ట్రిక్ట్ రోటరీ గవర్నం టి. రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పొన్నూరు రోటరీ క్లబ్ అధ్యక్షులు బి రామారావు అధ్యక్షతన నిడుబ్రోలులో పాములపాటి రవీంద్రనాథ్ గృహంలో జరిగిన బహిరంగ సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పొన్నూరు రోటరీ క్లబ్ అందిస్తున్న సేవలను ఆయన కొనియాడారు. రోటరీ క్లబ్ నూతన భవన నిర్మాణానికి స్థలదాత కొసరాజు సత్యనారాయణను ఆయన ఘనంగా సత్కరించారు. రోటరీ ఫౌండేషనుకు పొన్నూరు క్లబ్ సభ్యులు డొనేషన్లు అందజేశారు. ఓ బదిరునికి శ్రవణ యంత్రాన్ని ఆయన అందజేశారు. అనంతరం పాములపాటి రవీంద్రనాథ్ జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేసి అభినందించారు. రోటరీ క్లబ్ సభ్యులు కే ఎ. ప్రసాద్, అమరేంద్రనాథ్, కే ఆంజనేయులు, ఎం ఆదిశేషు, జి రాధాకృష్ణ, ఎన్ బాలకృష్ణ, తోట భాను, బివి చౌదరి, జిఎంఎస్ గుప్తా; షేక్ జానీ బేగ్, ఎంఎం కుదుస్, ఎన్ మేఘనాథ్, డాక్టర్ మురళీధర్‌రావు, ప్రదీప్ డాక్టర్ రవి రాకేష్ దేవ్, రాజేంద్ర చౌదరి, కే రామకృష్ణ పాల్గొన్నారు.

పత్రాల్లేని వారికి ఫైన్


వాహనాలను తనిఖీ చేస్తున్న రూరల్ పోలీసులు

ప్రజాశక్తి-తెనాలి రూరల్

స్థానిక బుర్రిపాలెం రోడ్డులో రూరల్ పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఆటోలు, ద్విచక్ర వాహనాలను, వాటి పత్రాలను తనిఖీ చేసి అపరాధ రుసుం వసూలు చేశారు. విజుబల్ పోలీసింగ్ లో భాగంగా వాహన తనిఖీలు చేసినట్లు రూరల్ ఎస్ఐ సిహెచ్ వెంకటేశ్వర్లు చెప్పారు. తనిఖీలో ట్రిపుల్ రైడింగ్, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపే వారిని, ఓవర్ స్పీడు, సెల్ఫోన్ డ్రైవింగ్ చేసేవారిని, ఆటోలో ఎక్సెస్ లోడ్తో వెళ్లే వారిని, యూనిఫామ్ లేకుండా ఆటో నడిపే వారిని గుర్తించి సుమారు పదిమంది వాహన చోదకులపై కేసులు నమోదు చేసి , వారి నుంచి అపరాధ రుసుము రూ7,500 వసూలు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలకు టివి బహూకరణ

ప్రజాశక్తి-అచ్చంపేట

గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు డిజిటల్ తరగతులు బోధనలు ఏర్పాటు చేయటం ఆనందదాయకమని అంబడిపూడి సర్పంచ్ బాబు అన్నారు. స్నేహహస్తాలు ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం మినీ డిజిటల్ తరగతుల నిర్వహణ నిమిత్తం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు టి.వి.ని అందజేశారు. 'స్నేహ హస్తాలు', పాఠశాల ఉపాధ్యాయులు సంయుక్తంగా రూ.12, 000 విలువ చేసే ఈ టివిని అందజేశారు. సర్పంచ్ కొమ్మ వరపు జనవరిబాబు చేతుల మీదుగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు పుష్పవతి అందజేశారు.



మిర్చి నిల్వలు

బ్యాగులు

మిర్చి దిగుమతి	:	65,627
మిర్చి ఎగుమతి	:	60,259
మిర్చి నిల్వ	:	30,803

మిర్చి ధరలు

రూపాయలలో

334	9,000 - 26,500
నెం.5	11,000- 26,000
273	13,000 - 23,000
341	10,000 - 25,000
4884	14,000 - 22,000
సూపర్ 10	22,500 - 25,000
నాన్ ఎసి	
తేజ	8,500 - 23,500
బడిగి	10,000 - 28,000
దేవనూరు డీలక్స్	11,500- 25,000
తాలుకాయలు	4,000 - 13,000
ఎసి	
334	13,500 - 15,000
తేజ	13,000 - 19,000
దేవనూరు డీలక్స్	20,000- 20,000
తాలుకాయలు	5,500 - 11,500

ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలి

- జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలి
- ఉచిత విద్యుత్తుకు చట్టబద్ధత కల్పించాలి
- కాలనీలను సందర్శించిన సిపిఎం బృందం

ప్రజాశక్తి-సత్తెనపల్లి

జగనన్న కాలనీ ఇళ్లకు ప్రభుత్వం ఐదు లక్షల రూపాయలు మంజూరు చేయాలని, మౌలిక వసతులు రోడ్లు, మంచినీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం సిపిఎం బృందం మండలంలోని అబ్బూరు రోడ్డులోని కొత్తగండ్లూరు, భీమవరం డొంకలోని జగనన్న కాలనీలను సందర్శించింది. లబ్ధిదారుల సమస్యలను అడిగి తెలుసుకుంది. సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ , సీనియర్ నాయకులు గద్దె చలమయ్య, వైస్ చైర్మన్ కోటేశ్వరరావు, నాయకులు జగనన్న ఇళ్లకు సంబంధించిన వివరాలు నిర్మాణం పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం పేదలకు ఇళ్లు నిర్మించాలని ఆర్భాటంగా కాలనీలను ఏర్పాటు చేసిందికానీ, సెంటు స్థలము ఇచ్చి రూ.1,80,000 ఇల్లు నిర్మించుకోమంటే అది ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. స్తోమత కలిగిన వారు బెడ్ రూమ్, హాలు, కిచెన్ అన్ని సౌకర్యాలతో నిర్మించుకుంటే రూ.5 లక్షల నుండి రూ.6 లక్షల వరకు ఖర్చు అవుతుందని అన్నారు. కానీ రోజువారీ కూలి పనులకు వెళ్లి జీవించే పేదవాడికి లక్ష ఎనభై వేల రూపాయలు ఇల్లు నిర్మించుకోవడానికి ఏమాత్రం సరిపోవని అన్నారు. ప్రభుత్వం ఎలాగైనా అన్ని ఇళ్ల కట్టించాలని, అలా కట్టకపోతే తమ స్థలాలను రద్దు చేస్తామని బెదిరిస్తున్నారని లబ్ధిదారులు వాపోయినట్లు వారు తెలిపారు.లబ్ధిదారులను బెదిరించటం సబబు కాదని అన్నారు. ప్రభుత్వం ఇచ్చే రూ.1,80,000 తో అన్ని వసతులతో ఇల్లు నిర్మించుకోవాలంటే మరొక మూడున్నర లక్షల రూపాయలు అప్పు చేయాల్సి వస్తుందని అన్నారు. అప్పు ఎలా తీర్చాలో, ఇల్లు ఎలా కట్టుకోవాలో ఆ పేదవాడికి అర్థం కాక సతమతమవుతున్నారని అన్నారు. లేదంటే ప్రభుత్వమే ఆ లక్ష ఎనభై వేల రూపాయలతో కాంట్రాక్టర్ల ద్వారా ఇల్లు కట్టిస్తుందని వారు కట్టే ఇల్లు బేస్ మట్టం వరకు బీమ్‌లు వేసి ఆపై డమ్మీ పిల్లర్స్ తో గోడలు కట్టి స్లాబు వేసి తలుపులు పెట్టి , ప్లాస్టింగ్ చేయించి ఇస్తారని లబ్ధిదారులు వాపోయినట్లు వారు తెలిపారు. నాణ్యత లేకుండా అలా నిర్మించిన ఇంటి వల్ల పేదవాడికి ఉపయోగమేమీ లేదని అన్నారు. కనుక, ప్రభుత్వం ప్రతి పేదవాడు అన్ని వసతులతో నాణ్యంగా ఇల్లు కట్టుకోవాలంటే ప్రభుత్వం ఐదు లక్షల రూపాయలు మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఇక్కడ ఇచ్చిన మొత్తం 570 ఇళ్లకు 300 ఇళ్లు మొదలుపెట్టారని సుమారు 70 ఇళ్లు అసంపూర్తిగా ఉన్నాయని చెప్పారు.

పది ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయని, రెండు కుటుంబాల వారు నివాసం ఉంటున్నారని చెప్పారు. మిగతా ఇళ్లన్నీ కూడా త్వరితగతిన పూర్తి కావా లంటే, నివాసయోగ్యంగా ఉండాలంటే ఆ కాలనీలో వెంటనే మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఆ ఇళ్లకు ప్రభుత్వం విద్యుత్తు లైన్‌లు వేయించిందని ,ఆన్‌లైన్‌లో పై ఇళ్లకు వైర్లతో కనెక్షన్లు ఇచ్చి మీటర్లు బిగించకుండా ఉచిత విద్యుత్తు వాడుకోండి అని చెబుతున్నారని లబ్ధిదారులు వాపోయినట్లు తెలిపారు. ఈ ప్రభుత్వం ఉన్నంతకాలం ఉచితంగా విద్యుత్‌ను వాడుకుంటారు కానీ వచ్చే ప్రభుత్వం ఆ ఉచిత విద్యుత్తును కొనసాగిస్తుందనేది ప్రశ్నార్థకమేనని అన్నారు. పభుత్వం జగనన్న కాలనీలకు ఇచ్చే ఉచిత విద్యుత్తుకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. భీమవరం డొంకలో క్వారీల్లో నిర్మించిన జగనన్న కాలనీలో ఇళ్లు బేస్ మట్టం వరకు నిర్మించి ఆగిపోయిందని అన్నారు. ఆ క్వారీల్లో వూటరావడం, తుంగ గడ్డి మొలవడంతో ఆ పిల్లర్స్ కున్న ఇనుప సువ్వలు తప్పు పట్టి పాడైపోతున్నాయని అన్నారు .ఇక్కడ నిర్మించే ఇళ్లకు ప్రభుత్వం మెరక తోలించి రోడ్ల సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఆయా కాల నీలను సందర్శించిన సిపిఎం బృందంలో సిపిఎం నాయకులు పొట్టి సూర్యప్రకాశరావు, గంజిమాల రవిబాబు, ఎం హరిపోతు రాజు,అవ్వారు ప్రసాదరావు,పెండ్యాల మహేష్, మక్కపాటి నరసింహారావు, జడ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.



కొత్తగండ్లూరు జగనన్న కాలనీలను సందర్శించిన సిపిఎం బృందం



భీమవరం డొంకలో జగనన్న కాలనీలను సందర్శించిన సిపిఎం బృందం



భూ రికార్డులను పరిశీలిస్తున్న ఏడిఏ నాగ శేఖర్

వివాదాస్పద భూముల పరిశీలన

ప్రజాశక్తి-ఈపూరు

మండలంలోని బొమ్మరాజుపల్లిలో సర్వే నెంబరు-3 లో వివాదాస్పద భూములను ఏడిఏ నాగ శేఖర్ బుధవారం పరిశీలించారు.ఆ సర్వే నెంబర్ లో 90.40 ఎకరాలు భూమికి సంబం ధించి కొం దరు తమ వద్ద పాస్ పుస్తకాలు ఉన్నాయని ఆరోపించగా, మరికొందరు తమకే ఉన్నాయని స్పందనలో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాలతో క్షేత్రస్థాయిలో భూ రికార్డులను ఏడిఏ క్షుణ్ణంగా పరిశీలించారు. భూ వివాదాల కారణంగా రీ సర్వే నిలిచిపోయిందని తెలిపారు. మిగిలిన భూ సర్వేను సంక్రాంతి పండగ అనంతరం పూర్తి చేసి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు.

పాలువాయిలో అసైన్డ్ భూముల పరిశీలన

ప్రజాశక్తి - రెంటచింతల

మండలంలోని పాలువాయిలో అసైన్డ్ భూములను గురజాల ఆర్డీవో కె. అద్దయ్య బుధవారం పరిశీలించారు. ఎంత కాలం నుంచి ఏయే పైర్లను సాగు చేస్తున్నారు, పాసు పుస్తకాలు ఇవ్వడంలో, ఆన్‌లైన్‌లో నమోదు చేయడంలోనూ ఎందుకు జాప్యం జరిగిందనే దానిపై విచారణ చేశారు. 739, 650,81/16 ఎఫ్ ,540 బి తదితర సర్వే నంబర్ల భూములను పరిశీలించి జాయింట్ కలెక్టర్‌కు నివేదిక సమ ర్పిస్తామని ఆయన చెప్పారు. రైతుల వద్ద నుంచి మొత్తం 14 దర ఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. తహశీల్దార్ కె.పుల్లారావు, ఆర్ఐ కాంతారావు, వీఆర్వో రామకృష్ణ, సర్వేయర్ కల్యాణ్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ జయరాజు పాల్గొన్నారు.



తారు రోడ్డుకు ప్యాచ్ వర్క్ పనులు ప్రారంభం

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-నాదెండ్ల

మండల కేంద్రమైన నాదెండ్ల నుండి సాతులూరు వరకు రోడ్డులో గుంతలపడటం వాహన దారులకు ఇబ్బందికరంగా మారిందంటూ ప్రజాశక్తిలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. తారు రోడ్డుకు ప్యాచ్ వర్క్ పనులు ప్రారంభించారు. నాదెండ్ల-సాతులూరు వరకు చందవరం, తూబాడు గ్రామాల మధ్య ఉన్న గుంతలను పూడ్చుతూ ప్యాచ్ వర్క్ చేస్తున్నారు

రేపటి నుంచి రాష్ట్ర స్థాయి గ్రామీణ క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి - నూజెండ్ల

మండలంలోని, కొత్త జాడ్డావారిపాలెంలో పార్డ్ (పారా అసోసియేషన్ ఫర్ రూరల్ డెలప్మెంట్) ఆధ్వర్యంలో ఈ నెల 13 వ తేదీ నుండి రాష్ట్ర స్థాయి గ్రామీణ క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు మేనే జర్ పారా వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. పార్డ్ గ్రామీణ క్రీడా ప్రాంగణంలో నిర్వహించనున్న ఈ పోటీల్లో మొదటి బహుమతి రూ,30,000, ,రెండవ బహుమతి రూ.20,000, మ్యాన్ ఆఫ్ దా సిరీస్ కింద కూడా బహుమతి ఉన్నట్లు తెలిపారు. మొదట రూ. 999 రుసుం చెల్లించిన 30 టీమ్స్ కు మాత్రమే ఈ అవకాశం ఉందని, ఆసక్తి గల జట్లు 8639714270,7661835461 నంబర్లలో సంప్రదించాలని కోరారు.



కోర్టు కోసం స్థల పరిశీలన

ప్రజాశక్తి - వినుకొండ

వినుకొండకు నూతనంగా మంజూరైన మున్సిబ్ సబ్ కోర్టు ఏర్పాటు కోసం స్థలంను, బిల్డింగ్‌లను గుంటూరు జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి వై.వి.ఎస్ బి జి. పార్థసారథి, వినుకొండ జూని యర్ సివిల్ జడ్జి పరిశీలించారు. ఈ సందర్భంగా వినుకొండలో జూనియర్ సివిల్ జడ్జి కోర్టును వారు బుధవారం సందర్శించారు. రికార్డ్ రూమ్ ను, ప్రాపర్టీ రూమ్ ను, కోర్టు లో మిగతా గదులను పరిశీలించారు. కోర్టు భవనాన్ని పరిశీలించి, పలు సూచనలు చేశారు. మునిసిబ్ సబ్ కోర్టు భవనం ఏర్పాటు నిమిత్తం రెవిన్యూ స్థలంతో పాటు, ఆర్ అండ్ బి గెస్టహౌస్ బిల్డింగ్, ఐసిడిఎస్ బిల్డింగ్, కరూర్ వైశ్యా బ్యాంక్‌పై ఉన్న ప్రైవేట్ బిల్డింగ్‌లను పరి శీలించారు. వినుకొండలో కేసుల సంఖ్య పెరుగుతున్న దృష్ట్యా నాలుగు కోర్టుల అవసరం ఉందని అన్నారు. అనంతరం న్యాయవాదులతో సమావేశం నిర్వహించి, పలు సూచనలు చేశారు. వినుకొండ న్యాయ మూర్తి ఎ.తౌషిద్ హుస్సేన్, బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు అరే సామ్రాజ్యం, సీనియర్ న్యాయవాది సిహెచ్ వెంకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా బోరింగ్ పంపు

ప్రజాశక్తి - చిలకలూరిపేట



స్థానిక రాగన్నపాలెం 27వ వార్డులో విశ్వనాథ్ థియేటర్ పక్క బజారులో ఉన్న బోరింగ్ పంపు సిమెంట్ దిమ్మ వద్ద తుప్పుపట్టి పోయిం సుమారు మూడు నెలలు అవుతోంది. దీంతో, పంపు కొడుతుంటే ఊగిపోతుండటమే తప్ప నీరు బయటకు రాని పరిస్థితి. దీని మరమ్మతుల గురించి పట్టించుకునే నాథుడే లేడు. సుమారు పది నుంచి పదిహేను కుటుంబాల వారు ఈ బోరింగ్ పంపు నీటిని వినియోగించే వారు. ఈ పంపు ఉండి కూడా ఉపయోగలేకుండా పోయిందని, ఆయా కుటుంబాల వారు అంటున్నారు. మాజీ కౌన్సి లర్ పాండు ఇంటి దగ్గరలో వున్న ఈ పంపును రిపేరు చేయించి నీటి వసతి కల్పించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. రాగన్నపాలెం, సుభాని నగర్ ప్రాంతాలలో సుమారు 10 నుంచి 12 బోరింగ్ పంపులు ఉన్నాయి. వీటిలో నాలుగైదు బోరింగ్‌ల పరిస్థితి కూడా ఇదే విధంగా ఉంది. ఎండాకాలం రానున్న నేపథ్యంలో ఆయా బోరింగ్ పంపులకు మరమ్మతులు నిర్వహించి వాటిని ఉపయోగపడేలా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

భద్రతే ప్రామాణికం తీసుకోండి

ప్రజాశక్తి - రెంటచింతల



భద్రతే ప్రామాణికంగా తీసుకొని ప్రతి ఒక్కరూ ముందుకు నడవాలని పరాశక్తి సిమెంట్స్ చీఫ్ జనరల్ మేనేజర్ ఎంఎస్ఎన్ రాజు కోరారు. బుధవారం ఫ్యాక్టరీ ఆవరణలో 34వ రోడ్డు భద్రత వారోత్సవాలను పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. తొలుత భద్రత జెండాను ఆవిష్కరించి కార్మికులు ,డ్రైవర్ల చేత ప్రతిజ్ఞ చేయించారు ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ మద్యం సేవించి, సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపొద్దని, హెల్మెట్ తప్పకుండా ధరించాలని సూచించారు కర్మాగారంలో వందలాది మందితో భారీ ర్యాలీ నిర్వహించి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మల్లి కార్జున, నాగరాజు ,ఉదయ్ ,వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

లే అవుట్లలో పిచ్చిమొక్కలు, ముళ్లచెట్లు

- జగనన్న కాలనీల్లో తాగు నీరు, రోడ్లు, విద్యుత్, డ్రెయినేజీ సమస్యలే అధికం
- పెరిగిన ఇనుమ, ఇసుక, సిమెంట్ ధరలతో ఇల్లు కట్టలేమంటున్న లబ్ధిదారులు
- ప్రభుత్వమే ఇల్లు నిర్మించి ఇవ్వాలని సిపిఎం సర్వేలో విన్నపాలు

ప్రజాశక్తి - తాడికొండ

జగనన్న కాలనీలలో మౌలిక వసతులు కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం తాడికొండ, బడేపురం పరిధిలోని జగనన్న కాలనీలను సిపిఎం ప్రతినిధి బృందం పరిశీలించింది. అనంతరం పాశం రామారావు మాట్లాడుతూ తాడికొండలోని బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల సమీపంలో ఉన్న జగనన్న ఇళ్ళ నిర్మాణానికి సంబంధించిన వెంచర్‌లో 20 శాతం మాత్రమే ఇళ్ళ నిర్మాణం పూర్తయ్యిందని చెప్పారు. తాడికొండ శివారు గ్రామం బడేపురంకు దగ్గరలో 50 మందికి ప్లాట్లు ఇవ్వగా 20 ఇళ్ల నిర్మాణం జరగగా మిగిలినవి అసంపూర్తిగా ఉన్నాయని అన్నారు. ఇంకోచోట 20 ఎకరాలలో 720 మందికి ప్లాట్లు కేటాయించగా ఒక్కరు కూడా ఇంటి నిర్మాణం మొదలుపెట్టలేదని వివరించారు. విద్యుత్, మంచినీరు సౌకర్యం లేక పోవడం తదితర కారణాల వల్ల లబ్దిదారులు ఇళ్ళ నిర్మాణానికి ముందుకు రావడం లేదని అన్నారు. మిగిలిన జగనన్న కాలనీలలో కూడా తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ, రోడ్లు లేవన్నారు. ఇసుక, ఇనుము, సిమెంట్ ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి ఇచ్చే రూ.1.80లక్షలు ఏమాత్రం సరిపోవని, రూ. 5లక్షలు అందించాలని, లేకుంటే ప్రభుత్వమే ఇల్లు నిర్మించాలని అన్నారు. సిపిఎం ప్రతినిధి బృందంలో జిల్లా నాయకులు కృష్ణకాంత్, మండల నాయకులు చింతల భాస్కరరావు, కె. పూర్ణయ్య ఉన్నారు.

ఫిరంగిపురం: జగనన్న కాలనీలలో పేదలు ఇల్లు పూర్తి చేసుకోవాలంటే రాష్ట్ర ప్రభుత్వం కనీసం ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని లేనిచో రాష్ట్ర ప్రభుత్వమే ఇల్లు కట్టించి ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు బైరగాని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మండలంలోని నుదురుపాడు, ఫిరంగిపురం గ్రామాల్లో స్థానిక సమస్యలపై సర్వే నిర్వహించగా మొత్తం సాంక్షన్ అయిన ఇళ్లల్లో 10 శాతం కూడా పూర్తి కాలేదని, దీనికి కారణం నిర్మాణానికి అయ్యే ఖర్చులు పెరిగిపోవడం, కాలనీలో మౌలిక సదుపాయాలు లేకపోవడమేనని అన్నారు. నుదురుపాడులో రైల్వే ట్రాక్ ప్రక్కన ఉన్న లేఅవుట్‌కి కనీసం దారి సౌకర్యం లేదని, సైడ్ కాలువలు లేకపోవడంతో నీరంతా పూర్తిగా నిలబడుతుందని అన్నారు. ఫిరంగిపురంలోని జగనన్న కాలనీలో కూడా 50 శాతం ఇల్లు మొదలు పెట్టలేదని మిగిలిన 50 శాతంలో కూడా చాలా ఇల్లు బేస్ లెవెల్‌లోనే ఉన్నాయన్నారు. మండలంలో 1785 ఇల్లు సాంక్షన్ కాగా కేవలం 176 మాత్రమే పూర్తి అవడం శోచనీయమని అన్నారు. సొంతంగా ఇల్లు కట్టుకోలేని పేదలందరినీ కూడా ఆప్షన్ 1 క్రింద సెలెక్ట్ చేయటం దారుణమని అన్నారు. మొదట్లో అధికారులు ఒత్తిడి మేరకు ఇండ్ల నిర్మాణం చేపట్టినా తర్వాత స్తోమత లేక ఇళ్ల నిర్మాణం ముందుకు వెళ్లలేదని, చెట్లు ,చామలు మొలిచి ఉంటున్నాయని అన్నారు. నుదురుపాడులో తూర్పు వైపున పొలాలకు వెళ్లే డొంకలను బాగు చేసి రోడ్లు వేయాలని, మురికి కాలువల నిర్మాణం చేపట్టాలని, ఉత్తరం వైపున హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో



తాడికొండలో లేఅవుట్లను పరిశీలిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామరావు

సిపిఎం మండల కార్యదర్శి షేక్ మస్తాన్ వలి ,మండల కమిటీ సభ్యులు వణుకూరి నరేంద్ర, ఆకారపు అంకమ్మరావు పాల్గొన్నారు.

పెదనందిపాడు: జగనన్న కాలనీల్లో ప్రభుత్వమే ఇల్లు నిర్మించి ఇవ్వాలని సిపిఎం మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్‌బాబు అన్నారు. బుధవారం జగనన్న కాలనీలు, స్థానిక సమస్యలపై సర్వేను వరగాని, పుసులూరు గ్రామాలలో చేపట్టారు. వరగానిలో మూడు ఎకరాల స్థలంలో 140 ప్లాట్లు రెడీగా ఉన్నా, 15 మందికి మాత్రమే పట్టాలు ఇచ్చారని గ్రామస్తులు తెలిపారు. అర్హులైన వారికి ఇంకా పొలం కొని ఇవ్వాల్సిన అవసరం ఉందని వారు సిపిఎం బృందం దృష్టికి తీసుకువచ్చారు. గ్రామంలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని, ఎస్సీ కాలనీలో సిసి రోడ్లు వేయాలని గ్రామస్తులు వాపోతున్నారన్నారు. పుసులూరు గ్రామంలో రెండు ఎకరాల స్థలంలో 90 మంది లబ్ధిదారులకు ప్లాట్లు ఇచ్చారని, స్థలాలలో తుమ్మ చెట్లు, పిచ్చి మొక్కలు పెరిగి అడవిలా తయారవుతున్నాయని గ్రామస్తులు తెలిపారు, గత టిడిపి ప్రభుత్వ హయాంలో పంపిణీ చేసిన 3సెంట్ల ఇళ్ల స్థలాలను ఇల్లు నిర్మించలేదన్న నేపంతో వెనక్కు తీసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో మురుగు కాలువలు శుభ్రం చేయాలని, రోడ్ల మరమ్మతులు చేయాలని గ్రామస్తులు కోరారు. సిపిఎం మండల కార్యదర్శి రమేష్ బాబు మాట్లాడుతూ ఇళ్ల స్థలాలు ఇచ్చిన ప్రతి ఒక్కరికి ప్రభుత్వమే ఇల్లు నిర్మించి ఇవ్వాలని, మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు, సమస్యల పరిష్కారం అయ్యేవరకు సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తామని తెలియజేశారు సిపిఎం నాయకులు ముద్దన వెంకటేశ్వర్లు, జంపని రామారావు, చుక్కా యానాదులు, మద్దూరి రమణ, పి. సుధీర్, కొత్త వెంకట శివరావు పాల్గొన్నారు.

తాడేపల్లి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో పాటు పేదలకు ఉపాధి కల్పించాలని సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. బుధవారం ఎంటిఎంసి పరిధిలోని వడ్డేశ్వరంలో సిపిఎం నాయకులు సంక్షేమ పథకాల అమలుపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో సరైన ఉపాధులు దొరకడం లేదని ఆయన అన్నారు. ఇటీవల గ్రామ సచివాలయాలలో సంక్షేమ పథకాలకు కోతపెట్టే విధంగా అధికారులు అనేక ఆంక్షలు విధించడం సరైనది కాదని ఆయన విమర్శించారు. తాడేపల్లి మండలంలోని వివిధ గ్రామాలలో వ్యవసాయ పనులు తగ్గటం వలన ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీల వద్ద అధిక వడ్డీలకు పేదలు డబ్బులు తీసుకునే పరిస్థితి ఏర్పడిందని సిపిఎం సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు అన్నారు. సిపిఎం వడ్డేశ్వరం సీనియర్ నాయకులు షేక్ పాపా సాహెబ్, వంగూరు రత్తమ్మ, బోడెమ్మ, వి సునీత పాల్గొన్నారు.

తెనాలి: టిడ్కో గృహ సముదాయాన్ని లబ్దిదారులకు ఎప్పుడు కేటాయిస్తారో చెప్పాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్.భవన్నారాయణ ప్రభుత్వాని ప్రశ్నించారు. స్థానిక జగ్గడిగుంటపాలెంలోని టిడ్కో గృహ సముదాయాన్ని,వాటిలో సౌకర్యాలను, నిర్మాణ పురోగతిని సిపిఎం బృందం బుధవారం పరిశీలించింది. ఈ సందర్భంగా భవన్నారాయణ మాట్లాడుతూ 2019 ఫిబ్రవరిలో అప్పట్లో అధికారంలో ఉన్న టిడిపి గృహ సముదాయాన్ని ప్రారంభిస్తే, గతేడాది అక్టోబరులో వైసిపి ప్రభుత్వం ప్రారంభోత్సవం చేసిందన్నారు. అయినా లబ్దిదారులకు మాత్రం గృహాలను అప్పజెప్పలేదన్నారు. తక్షణమే పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించి, లబ్దిడారులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ములకా శివసాంబిరెడ్డి, షేక్ హుస్సేన్‌వలి, కె, రవి పాల్గొన్నారు.

తాడేపల్లి: తాడేపల్లి పట్టణంలో సిపిఎం ఆధ్వర్యంలో బుధవారం సమస్యలపై సర్వే నిర్వహించారు. 15వ వార్డులో జరిగిన ఈ కార్యక్రమంలో తమకు పక్కా స్థలాలు మంజూరు చేయాలని రైల్వే స్థలాల బాధితులు కోరారు. ఇళ్ల మరమ్మతులకు అనుమతి ఇవ్వడంతో పాటు హామీపత్రాలు ఇచ్చిన లబ్దిదారులకు ఇళ్లస్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. పబ్లిక్, మంచినీటి కుళాయిలు బిగించాలని, దళితులకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్ కేటాయించాలని, బలవంతంగా చెత్త పన్ను వసూళ్ల నిలుపుదల చేయాలని, వెంకయ్య కొట్టు సమీపంలో కల్వర్టు నిర్మించాలని స్థానికులు సిపిఎం బృందానికి తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం శాఖ కార్యదర్శి బాబూరావు, పట్టణ కమిటీ సభ్యులు ఎస్.ముత్యాలరావు, డి.శంకరరావు పాల్గొన్నారు. ముగ్గురోడ్డు,పోతురాజు స్వామిగుడి ప్రాంతంలో కూడా సర్వేను నిర్వహించారు. ఇక్కడ కొండ ప్రాంతాల్లో పై నివసించే తాగునీరు అందడం లేదని, ఎన్ని సార్లు పించన్లుకు అప్లై చేసుకున్నా రావడం లేదని స్థానికులు సిపిఎం నాయకులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముగ్గురోడ్డు ఏరియా కార్యదర్శి దర్శనపు విజయబాబు పాల్గొన్నారు.



పెదనందిపాడులో పెరిగిన తుమ్మ చెట్లను చూపుతున్న స్థానికులు



ఫిరంగిపురంలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న సిపిఎం బృందం



తెనాలిలో టిడ్కో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న సిపిఎం బృందం



తాడేపల్లిలో సిపిఎం బృందానికి సమస్యలను తెలుపుతున్న స్థానికులు



వడ్డేశ్వరంలో స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న సిపిఎం బృందం



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నేతాజి

సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నేతాజి

ప్రజాశక్తి-గుంటూరు: సమస్యల పరిష్కారానికి జిల్లాలోని గ్రామపంచాయతీ వర్కర్లందరూ ఐక్యంగా ఉద్యమించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ పిలుపునిచ్చారు. డివి నరసింహారావు అధ్యక్షతన బుధవారం సిఐటియు కార్యాలయంలో జరిగిన ఏపీ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ప్రభుత్వ శాఖల్లో లేని విధంగా పంచాయతీలలో సెల్ఫ్ టెండర్ విధానం ఉండటం వల్ల కార్మికులు తీవ్ర అభద్రతకు గురవుతున్నారని అన్నారు. టెండర్ల రెన్యువల్ కూడా సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉండటం, ధరల పెరుగుదలకు అనుగుణంగా జీతాలు పెరగకపోవడం వంటి తీవ్ర సమస్యలు గ్రామపంచాయతీ కార్మికులు ఎదుర్కొంటున్నారని అన్నారు. గతేడాది యూనియన్ ఆధ్వర్యంలో పోరాటాల అనంతరం జిల్లా పంచాయతీ అధికారి జిల్లాలోని వర్కర్లకు యూనిఫారం, సబ్బులు, నూనెలు తదితర సౌకర్యాలు కల్పించాలని, వారానికి ఒకరోజు సెలవు ఇవ్వాలని ఉత్తర్వులు ఇచ్చినా నేటికీ అనేక పంచాయతీలలో అమలు చేయట్లేదన్నారు. గ్రీన్ అంబాసిడర్లకు ఇప్పటివరకు కేంద్ర ప్లానింగ్ కమిషన్ నిధులనుండి జీతాలు చెల్లించారని ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం చేతులెత్తేసిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ అంబాసిడర్ల జీతాలు పంచాయతీలే భరించాలని చెబుతుందన్నారు. అంతంత మాత్రం నిధులతో కాలం వెళ్ళదీస్తున్న పంచాయతీలు గ్రీన్ అంబాసిడర్లకు జీతాలు చెల్లించే పరిస్థితి లేక వారిని పని నుండి తొలగిస్తున్నాయని అన్నారు. గ్రీన్ అంబాసిడర్లకు రాష్ట్ర ప్రభుత్వమే జీతాలు చెల్లించాలని, కనీస వేతనాలు ఇవ్వాలని, ఇతర పంచాయతీ కార్మికులతో సమానంగా జీతభత్యాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున ఉద్యమాలకు సిద్ధం కావాలని నేతాజి పిలుపునిచ్చారు. సమావేశంలో సిఐటియు యూనియన్ జిల్లా నాయకులు డివి నరసింహారావు, కె.సుబ్బారావు, సిహెచ్.రామారావు, బి. ప్రభాకర్‌రావు, తదితరులు మాట్లాడారు.

నిబంధనలుపాటించని ట్రావెల్స్‌పై చర్యలు



ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి: నిబంధనలను అతిక్రమించిన ప్రైవేట్ ట్రావెల్స్ పై రవాణా శాఖ బుధవారం తనిఖీలు చేపట్టింది. సంక్రాంతి పండుగ సందర్భంగా అధిక చార్జీలు, సరుకు రవాణా చేస్తున్న, ప్యాసింజర్ ల జాబితాలను నిర్వహించకుండా బస్సులు నడుపుతున్న ప్రైవేట్ ట్రావెల్స్ పై ఇప్పటివరకు 32 కేసులు నమోదు చేశామని రవాణాశాఖ జిల్లా అధికారి కరీం తెలిపారు. ప్రైవేట్ ట్రావెల్స్ యజమానులు ఆర్టీసీ చార్జీలు ప్రామాణికంగా తీసుకొని వాటిని అనుసరించి మాత్రమే ధరలు వసూలు చేయాలన్నారు.

సిఐటియు జాతీయ మహాసభలు జయప్రదం చేయండి

ప్రజాశక్తి-గుంటూరు

బెంగుళూరులో జనవరి 18 నుండి 22 వరకూ జరుగుతున్న సిఐటియు 17వ అఖిలభారత మహాసభలను జయప్రదం చేయాలని యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ పిలుపునిచ్చారు. స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయం బుధవారం యూనియన్ జెండాను జిల్లా అధ్యక్షులు దండా లక్ష్మీనారాయణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నేతాజీ మాట్లాడుతూ సిఐటియు కార్మికుల హక్కుల కోసం రాజీలేని పోరాటం నిర్వహిస్తుందన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చాక కార్మికుల హక్కులు హరించే విధంగా కార్మిక చట్టాలను రద్దు చేస్తూ, నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొస్తుందన్నారు.కార్పొరేట్లకు దాసోహం అన్నట్లు కార్మికులపై మరిన్ని భారాలు వేస్తుందన్నారు. పనిగంటలు పెంచుతూ, కార్మిక సంఘాలు ఏర్పాటు కూడా అనుమతి లేని విధంగా నిరంకుశ విధానాలు అమలు చేస్తుందన్నారు. దేశవ్యాప్తంగా కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించనున్నట్లు చెప్పారు.కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి బి.లక్ష్మణరావు, జిల్లా కమిటీ సభ్యులు డీవీ నరసింహారావు, నాయకులు కె.సుబ్బారావు, బి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

దుగ్గిరాల: మండలంలోని ఈమని గ్రామంలో పంచాయతీ కార్మికులు ఆధ్వర్యంలో సిఐటియు జెండాను గౌరవాధ్యక్షులు జెట్టి బాలరాజు ఆవిష్కరించారు బెంగళూరులో ఈనెల 18 నుండి 22 వరకు జరగనున్న సిఐటియు ఆలిండియా మహాసభలు విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ర్యాలీలు సభలు నిషేదిస్తూ జారీ చేసిన జిఓ 1 కాఫీలను దగ్ధం చేశారు. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు అప్రజాస్వామికమని తక్షణమే ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దాసు కట్టా. గోఫీ. నలకుర్తి రత్నం. సుగుణరావు రాహేలమ్మ పాల్గొన్నారు.



గుంటూరులో జెండా ఆవిష్కరిస్తున్నదండా లక్ష్మీనారాయణ



దుగ్గిరాలలో జెండా ఆవిష్కరిస్తున్న జెట్టి బాలరాజు


భూ వివాదం.. రైతు ఆత్మహత్యాయత్నం

- ముప్పాళ్ల మండలం మాదలలో ఘటన
- సూసైడ్‌నోట్ రాసిన రైతు

ప్రజాశక్తి - ముప్పాళ్ల

వేరొకరి పొలం సర్వే చేసి అన్యాయంగా తన భూమిలో సర్వే రాళ్ళు వేశారని సూసైడ్ నోట్ రాసి గడ్డిమందు తాగి రైతు ఆత్మహత్యయత్నం చేసిన ఘటన మండలంలోని మాదలలో చోటుచేసుకుంది. బాధితుడి కుటుంబ సభ్యుల వివరాలు ప్రకారం గ్రామానికి చెందిన మర్రిపూడి లక్ష్మయ్యకు మాదల పెట్రోల్ బంక్ వద్ద 546/1 లో 60సెంట్ల వ్యవసాయ భూమి ఉంది. లక్ష్మయ్య భూమి పక్కనే అదే గ్రామానికి చెందిన సొంటినేని శ్రీనివాసరావుకు 27 సెంట్ల భూమి ఉంది. ఈ క్రమంలో శ్రీనివాసరావు మంగళవారం మండల సర్వేయర్ ఉల్లిగడ్డల ఏడు కొండలు, పోలీసులను అక్కడికి తీసుకొనివెళ్ళి భూమి కొలతలు వేయించారు. లక్ష్మయ్య,శ్రీనివాసరావు మధ్య గల భూమిలో ఉన్న హద్దురాళ్ళను కాదని, లక్ష్మయ్య భూమిలో శ్రీనివాసరావు భూమి ఉందంటూ హద్దు రాళ్ళను వేయించారు. దీంతో మనస్తాపం చెందిన లక్ష్మయ్య తన చావుకు సంబంధిత అధికారులు కారణమని పేర్కొంటూ బుధవారం సూసైడ్ నోట్ రాసి, గడ్డి మందు తాగి ఇంట్లో ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. ఇది గమనించిన కుటుంబసభ్యులు హుటాహుటిన సత్తెనపల్లిలో ని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. లక్ష్మయ్య పరిస్థితి విషమంగా ఉండ డంతో గుంటూరు తరలించినట్లు సమాచారం. ఈ విషయమై తహశీల్దార్ భవానీ శంకర్ ను వివరణ కోరగా లక్ష్మయ్య పిన్ని వద్ద నుంచి, ఆ తర్వాత మరో ముగ్గురు వద్ద నుండి శ్రీనివాసరావుకు కొనుగోలు ద్వారా భూమి వచ్చిందని చెప్పారు. అతని దస్తావేజులు,భూ విస్తీర్ణంను అనుసరించి కొలతలు వేసి హద్దురాళ్ళను వేసినట్లు వివరించారు.





25 గ్యాస్ సిలిండర్లు స్వాధీనం

ప్రజాశక్తి - చిలకలూరిపేట



పట్టణంలో హోటల్స్, రెస్టారెంట్లు, టీ స్టాల్స్, బేకరీ షాపుల్లో, ఇతర చిన్న వ్యాపార సంస్థల్లో గృహా వసరాలకు వినియోగించే ఎల్‌పిజి గ్యాస్ సిలిండర్లను వాడుతున్నారంటూ వచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం తనిఖీలు నిర్వహించినట్లు పల్నాడు జిల్లా పౌరసరఫరాల అధికారి జి. మోహన్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు గృహావసరాలకు వినియోగించే సిలిండర్లను వ్యాపార అవసరాలకు వినియోగిస్తే వారిపై కఠిన చర్యలు తప్ప వని హెచ్చరించారు. నిత్యం నిఘా ఉంటుందని చెప్పారు. ఈ విషయమై చిన్న, పెద్ద వ్యాపార సంస్థలు సహకరించాలని కోరారు. పట్టణముని హోటల్స్, టీ స్టాల్స్, ఇతర వ్యాపార సంస్థల పై తనిఖీలు చేపట్టి 25 గృహావసరాలకు వినియోగించే ఎల్‌పిజి సిలిండర్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. స్వాధీనం చేసుకున్న ఈ సిలిండర్లను హెచ్‌పి కంపెనీ గూడెంలో ప్రత్యేకంగా ఉంచామని, తదుపరి నిర్ణయం తీసుకుంటామని అన్నారు. ఈ దాడుల్లో ఎఎస్ఒ బాషా, సిఎస్‌డిటిలు టి.కొండారెడ్డి, శర్మ, అరుణాదేవి, మురళీధరరావు, గఫూర్, గురజాల, సత్తెనపల్లి, మాచర్ల, పెదకూరపాడు, చిలకలూరిపేట సిఎస్‌డిటిలు పాల్గొన్నారు.



విద్యార్థులు దేశభక్తి, క్రమశిక్షణతో మెలగాలి

ప్రజాశక్తి-మాచర్ల

విద్యార్థులు దేశభక్తి, క్రమశిక్షణతో రాణించాలని కోర్టు న్యాయమూర్తి సి మధుబాబు అన్నారు. స్థానిక జడ్‌పి బాలికల పాఠశాల ఆవరణలో స్వామి వివేకానందుని 161వ జయంతిని పురస్కరించుకుని బుధవారం ఉదయం యువజనోత్స కార్యక్రమాలను శ్రీరామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన న్యాయమూర్తి మధుబాబు, వివేకానందుని చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. హెచ్.ఎం ఐవి నాగ మణి, చింతలపూడి వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ ముంతాజ్ బేగం మృతి

ప్రజాశక్తి - యడ్లపాడు



మండలంలోని కారుచోల మాజీ సర్పంచ్ సయ్యద్ ముంతాజ్ బేగం (58) అనారోగ్యంతో మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమె మంగళ వారం రాత్రి రెండు గంటల సమయంలో తన నివాసంలో మృతి చెందారు. వైసిపి తరపున స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించిన తొలి గ్రామ పంచాయతి సర్పంచ్ ఆమె. సర్పంచ్ హోదాలో 2013-2018 మధ్య కాలంలో అనేక అభివృద్ధి పనులు చేశారు. మనబడి నాడు-నేడు పథకం రాకముందే గ్రామంలోని ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో రూ.5 లక్షలతో మౌలిక సదుపాయాలను కల్పించి దాని రూపురేఖలు మార్చారు. శిథిలావస్థకు చేరిన భవనాన్ని తొలగించి నూతన పంచాయతి భవనాన్ని నిర్మించారు. దీర్ఘకాలంగా ఉన్న మంచినీటి పథకం తిరిగి అమల్లోకి తీసుకువచ్చారు. గ్రామంలో అత్యధిక మరుగుదొడ్ల నిర్మాణాలు జరిగేలా చూశారు. ప్రస్తుతం వైసిపి నాయకుడిగా ఉన్న ఆమె భర్త ముగ్ధుం, గతంలో యడ్లపాడు మండల, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా వ్యవహరించారు. వీరికి కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

అనారోగ్యంతో ఆశా వర్కర్ మృతి.. సిఐటియు నివాళి

ప్రజాశక్తి-నరసరావుపేట

మండలంలోని రావిపాడు గ్రామానికి చెందిన ఆశా వర్కర్ డొక్కా రాణి అనారోగ్యంతో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. కోటప్పకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఆమె పని చేస్తున్నారు. 2006 నుండి ఆశావర్కర్‌గా పని చేసే కాలంలో రెండు సార్లు బెస్ట్ ఆశావర్కర్ అవార్డు అందుకున్నారు. రెండేళ్ల క్రితం కేన్సర్ వ్యాధిన బారినపడ్డ ఆమె చికిత్స పొందుతూ కూడా విధులకు హాజరయ్యారు. రాణి మృతదేహాన్ని ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) పల్నాడు జిల్లా కార్యదర్శి డి.శివ కుమారి బుధవారం సందర్శించి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ అనారోగ్యంతో ఉన్నప్పటికీ అం కిత భావంతో పని చేసిన రాణిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. రాణి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆమె మృతిపై జిల్లా అధ్యక్షులు జి.నీరజకుమారి, నాగలక్ష్మి, గోవిందమ్మ, సత్య వతి, పద్మావతి, ధనలక్ష్మి,కనక రత్నం సంతాపం తెలిపారు.



నివాళులర్పిస్తున్న ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) పల్నాడు జిల్లా కార్యదర్శి డి.శివ కుమారి శివకుమారి,తదితరులు

ఆర్‌ఆర్‌ఆర్ చిత్ర బృందానికి అభినందనలు

చంద్రబోస్ సుచిత్ర సేవాసమితి వ్యవస్థాపకులు

ప్రజాశక్తి - నూజెండ్ల



ఆర్.ఆర్.ఆర్. చిత్ర గీతానికి గోల్డెన్ గ్లోబ్ పురస్కారం రావడం సంతోషకరమని చంద్రబోస్ సుచిత్ర సేవాసమితి వ్యవస్థాపకులు ఎపి. నాయుడు ఆనందం వ్యక్తం చేశారు. ఆర్.ఆర్.ఆర్. చిత్రంలోని 'నాటు నాటు' గీతానికి ప్రతిష్టాత్మకమైన గోల్డెన్ గ్లోబ్ పురస్కారం దక్కడం భారతీయులందరూ ఎంతో సంతోషించదగ్గ విషయమన్నారు ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటున్న ఈ గీతాన్ని రచించిన చంద్రబోస్, స్వరకల్పన చేసిన ఎం.ఎం.కీరవాణికి, గాయకులు రాహుల్ సిప్లిగంజ్,కాలభైరవలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు ఆస్కార్ పురస్కారం కోసం పోటీపడుతున్న ఈ చిత్రం ఆ వేదికపైనా పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు.

మన పండుగలే మన సంస్కృతి

ప్రజాశక్తి-మాచర్ల

మన పండుగలే మన సంస్కృతిని తెలియజేస్తాయని పల్నాడు జిల్లా వ్యవసాయశాఖ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయిమార్కోండారెడ్డి అన్నారు. స్థానిక చక్రధర్ డిగ్రీ, పిజి కాలేజి సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేగిపండ్లు, భోగిమంటలు, రంగవల్లులు, హరిదాసు కీర్తనలు, గంగిరెద్దుల కోలాహలంతో సంక్రాంతి పండుగలో మన సంస్కృతి కనిపిస్తుం దన్నారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా లయన్స్ క్లబ్ అధ్యక్షులు విడేల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రజలతో మమేకం కావాలి

ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-మాచర్ల



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైసిపి పార్టీ 2024లో మరోసారి అధికార పగ్గాలు చేపట్టేలా నాయకులు ప్రజలతో మమేకం కావాలని తిరుపతి ఎం.ఎల్.ఎ, వైసిపి పార్టీ జోనల్ కమిటీ సమన్వయకర్త భూమన కరుణాకర్‌రెడ్డి అన్నారు. స్థానిక జివి గ్రాండ్‌లో వైసిపి పార్టీ పల్నాడు జిల్లా రీజనల్ కో ఆర్డినేషన్ సమావేశం బుధవారం ఉదయం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ అధినేత ఆదేశాల మేరకు స్థానిక ఎం.ఎల్.ఎ, ప్రజా ప్రతినిధులు, నాయకులు ప్రజలలో ఉంటూ, వారి సమస్యలు పరిష్కరిస్తూ వారి సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. దిగువ స్థాయి నాయకులు, కార్యకర్తలు తమ అభిప్రాయాలను దాపరికం లేకుండా తెలపాలని సూచించారు. అనంతరం మరో ముఖ్యఅతిథి జోనల్ కమిటీ సమన్వయకర్త, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు మాట్లాడారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామక్రిష్ణారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో సరికొత్త రాజకీయ రసాయనికచర్య ప్రారంభమొందని, దీనికి ఎవరు భయపడాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో వైసిపి యువజన సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యాక్సిన్ నిర్వహణను సకాలంలో పూర్తి చేయాలి

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో డాక్టర్ జి.శోభారాణి అధ్యక్షతన జిల్లాలో కొత్తగా నియామకమైన 12 మంది ఫార్మసిస్టులకు,17 మంది ల్యాబ్ టెక్నీ షియన్లకు ఓరియంటేషన్ ట్రైనింగ్ క్యాంపు బుధవారం నిర్వహించారు. డాక్టర్ జి. చంద్రశేఖర్ మాట్లాడుతూ అందరూ ల్యాబ్ టెక్నీషియన్స్ అన్ని రకాల రికార్డులను నిర్వహిస్తూ, ప్రభుత్వ వైద్యాధికారి సూచించిన అన్ని రకాల టెస్టులను నిర్వహించి ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. అందరూ ఫార్మ సిస్టులు వ్యాక్సిన్, మందుల నిర్వహణను సకాలంలో పూర్తి చేయాలన్నారు. డాక్టర్ జి శోభారాణి జిల్లా వైద్య శాఖ అధికారి మాట్లాడుతూ అందరూ ఫార్మసిస్టులు ,ల్యాబ్ టెక్నీషియన్లు సమయపాలన పాటించాలని, ఉద్యోగ బాధ్యతలను నిర్వహించాలని సూచించారు. డిప్యూటీ డిఎంహెచ్, డాక్టర్ గీతాంజలి,డిఐఒడాక్టర్ హనుమ కుమార్ పాల్గొన్నారు.

తాళ్లూరు పిహెచ్‌సి వైద్యురాలు బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-పెదకూరపాడు



సిరి చందన

మండలంలోని తాళ్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులుగా మంటి సిరి చందన బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. ప్రస్తుతం పని చేస్తున్న డాక్టర్ ప్రియాంక రెండు నెలలు సెలవుపై వెళ్లారు. ఆస్థానంలో డిఎంహెచ్ఓ కార్యాలయం నుంచి నియమించారు. తన వంతు వైద్య సేవలు ప్రజలకు అందిస్తానని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. ఆస్పత్రి అభివద్ధికి కషి చేస్తానన్నారు. ఆమెను సిబ్బంది అభినందించారు.

మండలంలో 345 మందికి జగనన్న తోడు

ప్రజాశక్తి - రెంటచింతల

జగనన్న తోడు పథకం ద్వారా ఆరో విడత చిరు వ్యాపారాలు చేసుకునే 345 మందికి 34 లక్షల 50 వేల రూపాయలను వారి బ్యాంకు ఖాతాల్లో జమ అయనట్లు వెలుగు ఎపిఎం చిన్నబాబు బుధవారం తెలిపారు. అలాగే, ఐదో విడతలో సున్న వడ్డీ కింద రుణం తీసుకొని సకాలంలో చెల్లించిన 1074 మందికి 2,94, 470 రూపాయలు మాఫీ జరిగినట్లు వివరించారు.

మాగులూరి ఫౌండేషన్ రగ్గులు పంపిణీ

ప్రజాశక్తి-పెదకూరపాడు

మండలంలోని తమ్మవరంలో బుధవారం రాత్రి మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వృద్ధులకు, వితంతువులకు రగ్గులు పంపిణీ చేశారు. మాగులూరి ఫౌండేషన్ అధినేత, ఎన్నారై మాగులూరి భాను ప్రకాష్ చేతుల మీదుగా వీటిని అందజేశారు.

వివాదాస్పదంగా ఉపాధ్యాయిని డిప్యూటేషన్

ప్రజాశక్తి - ముప్పాళ్ల

రాజకీయ కారణాలతో చేపట్టిన డిప్యూ టేషన్ వివాదాస్పందమైంది. తన డిప్యూటేషన్‌పై ఓ ఉపాధ్యాయిని కోర్టును ఆశ్రయించగా హైకో ర్టులో ఊరట లభించింది. వివరాల ప్రకారం.. మండల కేంద్రమైన ముప్పాళ్లలోని జెడ్‌పి పాఠశాలలో ఎస్‌జిటి ఉపాధ్యాయినిగా ఇనకొల్లు పున్నమ్మ ఏడాదికి పైగా పని చేస్తున్నారు. కొన్ని రాజకీయ కారణాల వల్ల ఆమెను బొల్లాపల్లి మం డలానికి డిప్యూటేషన్‌పై బదిలీ చేస్తూ ఈనెల 4వ తేదీన వాట్సప్ ద్వారా సమాచారం ఇచ్చారు. దీనిపై ఆమె 5వ తేదీనే కోర్టును ఆశ్ర యించగా డిప్యూటేషన్‌ను నిలిపేస్తూ హైకోర్టు 6వ తేదీన స్టే ఇచ్చింది. అయితే ఉపా ధ్యాయిని ముప్పాళ్లలోనే విధులకు హాజరవుతూ ముఖ ఆధారిత బయోమెట్రిక్ ద్వారా హాజరు నమోదు చేస్తున్నా మాన్యువల్ రిజిస్టర్‌లో మాత్రం సంతకం చేయడానికి పాఠశాల హెచ్‌ఎం అనుమతించడం లేదని తెలిసింది. దీనిపై హెచ్‌ఎంను వివరణ కోరగా మండల విద్యాశాఖాధికారి ఆదేశాల మేరకే రిజిస్టర్‌లో హాజరు నమోదు చేయడచం లేదని చెప్పారు. మరోవైపు జిల్లా విద్యాశాఖాధికారి నుండి ఉత్తర్వులు వస్తేనే హాజరు తీసుకుంటామని బాధిత ఉపాధ్యాయినికి ఎంఇఒ తెలిపినట్లు సమాచారం.

కార్పొరేట్‌కు దీటుగా అర్బన్ హెల్త్ సెంటర్లు

జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా డాక్టర్ వైయస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్లను నిర్మించడం జరిగిందని జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరి -తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి చినకాకాని జాతీయ రహదారి వెంబడి సుమారు రూ.1.30 కోట్లతో నిర్మించిన డాక్టర్ వైయస్సార్ అర్బన్ హెల్త్ కేర్ సెంటర్‌ను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి బుధవారం ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 32 నూతన అర్బన్ హెల్త్ సెంటర్లను నిర్మించామని, మరో 17 హెల్త్ సెంటర్లను ఆధునికీకరించి ప్రజలకు వైద్య సేవలను అందించడం జరుగుతుందన్నారు. మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో స్థానిక ఎమ్మెల్యే ఆర్కే ,ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుల ప్రత్యేక చొరవతో అధునాతన అర్బన్ హెల్త్ సెంటర్‌ను నిర్మించడం అభినందనీయమన్నారు. వ్యాధులతో వచ్చామనే బాధ కలగకుండా రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాలని కోరారు. అర్బన్ హెల్త్ సెంటర్లో వైద్య పరికరాలను త్వరగా ఏర్పాటు చేయించి వైద్య సేవలు వెంటనే ప్రారంభించాలని అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే ఆళ్ల రామకష్ణారెడ్డి మాట్లాడుతూ . సీఎం జగన్ మోహన్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి తొమ్మిది అర్బన్ హెల్త్ సెంటర్లను కేటాయించగా... ఎనిమిది అర్బన్ హెల్త్ సెంటర్లను ప్రారంభించుకోవడం జరిగిందని,



హెల్త్‌సెంటర్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

కుంచనపల్లిలో తుది దశకు చేరుకున్న డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ కేర్ సెంటర్‌ను మరో నాలుగు ఐదు రోజుల్లో ప్రారంభించనున్నట్లు తెలిపారు. పూర్తిస్థాయిలో పేదలకు ఆరోగ్యపరంగా అండగా ఉండాలనే లక్ష్యంతో ప్రైవేటు ఆసుపత్రులకు ధీటుగా హెల్త్ కేర్ సెంటర్లను నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, నగర పాలక సంస్థ కమిషనర్ శారదా దేవి, ఎస్సీ శ్రీనివాసరావు, డి ఈ కష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న నికోలస్

మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దు

ప్రజాశక్తి-తాడేపల్లి

విద్యార్థులు మత్తు పదార్థలకు బానిసలు కావొద్దని, మనిషిలోని కోపం, ఆవేశం తగ్గించుకుంటే మంచి విజయాలు సాధించవచ్చని నవజీవన్‌బాలభవన్ క్లినికల్ సైకాలజిస్ట్ నికోలస్ తెలిపారు. బుధవారం నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో తాడేపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో మహిళా సంరక్షణ కార్యదర్శులు, మెప్మా రిసోర్స్ పర్సన్లు, మత్తు పదార్ధాల వినియోగం, సోషల్ మీడియా దుర్వినియోగంపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు .కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సమాజాకి మాధ్యమాలు మంచి కంటే కీడు ఎక్కువగా చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఒంటరితనం, డిప్రెషన్, నిద్రలేమికి సోషల్ మీడియా కారణమౌతుందని చెప్పారు. వీటికి బానిసలైన వారిని కౌన్సిలింగ్‌తో బయటపడవచ్చని చెప్పారు. పోగ్రాం మేనేజర్ జి.శేఖఱ్‌బాబు, తాడేపల్లి ఎస్ఐ డి.రమేష్, జోనల్ కో-ఆర్డినేటర్ బి.రమేష్ పాల్గొన్నారు.

లక్ష్యాలను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో ప్రభుత్వ కార్యక్రమాల అమలుకు నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించటంలో నిర్లక్ష్యం వహించే అధికారులపై శాఖాపరంగా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, జెసి రాజకుమారితో కలసి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సబ్ కలెక్టర్, ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, ఎంపీడివో, వివిధ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ రబీ పంట ఈ క్రాప్ బుకింగ్, పిఎం కిసాన్ ఈ కేవైసీ జనవరి 13 నాటిక పూర్తి చేయాలన్నారు. సంక్రాంతి సందర్భంగా గ్రామాల్లో కోడిపందాలు జరగకుండా నిరంతరం పర్యవేక్షించాలన్నారు.స్పందన ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించాలని, జగనన్నకు చెబుదాంలో అందిన ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి 24 గంటల్లో ఓపెన్ చేసి పరిశీలించాలన్నారు. పత్రికలలో వచ్చిన వ్యతిరేక వార్తలపై సంబంధిత శాఖలు సక్రమంగా విచారించి ఖండన, వివరణ ప్రకటనలు వెంటనే జారీ చేయాలన్నారు. పేదలందరికీ ఇళ్ళ పథకంలో నిర్మిస్తున్న ఇళ్ళ లో ఉగాది నాటికి పదివేల ఇళు గృహప్రవేశాలు చేసేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో డిఆర్ఒ కె.చంద్రశేఖర్‌రావు, హౌసింగ్ పీడీ సాయినాథ కుమార్,జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎన్. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణబాలు కాలనీలో పట్టాలు పంపిణీ

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక కష్ణబాబు కాలనీలో జగనన్న శాశ్వత గృహ హక్కు పథకంలో అర్హులైన లబ్దిదారులకు ఇంటి పట్టాలను బుధవారం సంయుక్త కలెక్టర్ జి.రాజ కుమారి, ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, మేయర్ కావటి శివనాగామనోహర్ నాయుడు, ఎమ్మెల్యే మద్దాలి గిరిధరరావులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ఒకప్పుడు రోడ్డు విస్తరణలో భాగంగా అందరిని కృష్ణబాబు కాలనీకి తరలించడం జరిగిందని, హౌసింగ్‌శాఖ వద్ద లోన్ తీసుకొని ఇల్లు నిర్మించుకొని నివసిస్తున్నారని, వాటి మీద హక్కు కల్పించడానికి జగనన్న శాశ్వత గృహ హక్కు పథకంలో 24 మంది లబ్దిదారులకు గృహ హక్కు



పట్టాలు అందచేస్తున్న జెసి, తదితరులు

పత్రాలు పంపిణీ చేసినట్లు చెప్పారు. మిగిలిన వారికీ పొజిషన్ సర్టిఫికెట్స్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇంకా ఎవరైనా హౌసింగ్ శాఖ ద్వారా లోన్ తీసుకొని ఇల్లు కట్టుకొని ఆన్లైన్‌లో పేర్లు రాని వారు ఉంటే వారి వివరాలు అందించాలన్నారు. 39వ డివిజన్ కార్పొరేటర్ షేక్. జుమ్మాబి, మార్కెట్ యార్డు చైర్మన్ చంద్రగిరి ఏసు రత్నం, జీడీసీసీ బ్యాంకు చైర్మన్ ఆర్.సీతారామాంజనేయులు, డిప్యూటీ మేయర్ సజీలా తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు

- సంప్రదాయ దుస్తులతో అలరించిన చిన్నారులు
- పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం

గీతాంజలి హైస్కూల్లో ముందస్తు సంక్రాంతి

ప్రజాశక్తి- గుంటూరు

స్థానిక ఏటిఅగ్రహారం, రామిరెడ్డి నగర్‌లోని గీతాంజలి హైస్కూల్లో బుధవారం ముందస్తు సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రంగవల్లులు, హరిదాసు కీర్తనలు, సాంప్రదాయ వస్త్రాలతో స్కూలు ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. స్కూల్ డైరెక్టర్ షేక్.హుస్సేన్ విద్యార్థులకు సంక్రాంతి విశిష్టతను వివరించారు. చిన్నారులకు భోగిపండ్లు పోసి ఆశీర్వదించారు. పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి బహుమతులు అందజేశారు.కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం, తల్లిదండ్రులు పాల్గొన్నారు

తెనాలి: విద్యార్థుల్లో మతసామరస్యాన్ని పెంపొందించేందుకు పండుగలు నిర్వహించటం అభినందనీయమని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. స్థానిక బోస్‌రోడ్డులోని నెహ్రూ నికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో బుధవారం నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో చిన్నారులు వేసిన ముగ్గులు, గొబ్బెమ్మలు, గంగిరెద్దులు, పొంగళ్లు, హరిదాసుల సందడి ఆకట్టుకున్నాయి. సాంప్రదాయ దుస్తుల్లో సాంస్కృతిక ప్రదర్శనలు చేశారు. ముఖ్యఅతిదిగా పాల్గొన్న ఎమ్మెల్యే విద్యార్థులను, పాఠశాల యాజమాన్యాన్ని ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ మురళీకాంత్ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో నెహ్రూ నికేతన్ వ్యవస్థాపకులు ప్రకాశరావు, రంగలక్ష్మి దంపతులు, కౌన్సిలర్లు గుంటూరు కోటేశ్వరరావు, జి.సాయిహరేరామ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-మంగళగిరి రూరల్

ఆత్మకూరు బాపూజీ విద్యాలయంలో సంక్రాంతి సందర్భంగా విద్యార్థులకు, తల్లిదండ్రులకు వివిధ రకాల పోటీలను పాఠశాల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ముగ్గుల పోటీలను, మ్యూజికల్ చైర్స్, వాలీబాల్, షటిల్, టగ్ ఆఫ్ వార్, ఏడు పెంకుల ఆట వంటి పోటీలను నిర్వహించారు. విద్యాలయ అధినేత వై తులసీరామ్, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ వై సుజాత, ఆనందరావు, ప్రిన్సిపాల్ సుబ్బారావు, హెచ్‌ఎం శ్రీనివాసరావు పరిశీలించారు.

ప్రజాశక్తి- తాడేపల్లి రూరల్:

ఎంటిఎంసి పరిధిలోని వడ్డేశ్వరం జడ్పీ హైస్కూల్, మహిళా కళాశాలలో విద్యార్థులకు సంక్రాంతి పండుగను పురస్కరించుకొని, ముగ్గుల పోటీలను ఉపాధ్యాయులు నిర్వహించారు. 6వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు సుమారు 30 మంది విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొన్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి సుబ్బారావు తెలిపారు. ముగ్గుల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కాకుమాను జోజప్ప, డివి రమణమ్మ, ఉమాదేవి, పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.



గుంటూరు గీతాంజలీ స్కూల్లో విద్యార్థులకు భోగిపళ్లు పోస్తున్న స్కూల్ డైరెక్టర్, హెచ్‌ఎం



ఆత్మకూరు బాపూజీ విద్యాలయంలో ..



వడ్డేశ్వరంలో ..



తాగునీటి కొరత లేకుండా చర్యలు

ప్రజాశక్తి-గుంటూరు:నగరంలో తాగునీటి సరఫరాలో అప్రమత్తంగా ఉండాలని, సమ్మర్ యాక్షన్‌ప్లాన్ వరకు వేచి ఉండకుండా ఎప్పటికప్పుడు రిజర్వాయర్లు, ఫిల్టరేషన్ పాయింట్స్, పైప్‌లైన్ల మరమ్మతులు చేపట్టాలని నగర కమిషనరు కీర్తి చేకూరి ఇంజినీరింగ్ అధికారులకు స్పష్టం చేశారు. బుధవారం కమిషనర్ ఏటుకూరులోని చెరువు చుట్టూ ఏర్పాటు చేసిన ఫెన్సింగ్, రిజర్వాయర్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ఫిల్టర్‌బెడ్స్, తక్కెళ్లపాడు హెడ్ వాటర్‌వర్క్స్‌లో నిర్మాణం చేసిన సిసి రోడ్, ఫిల్టర్ బెడ్‌లను పరిశీలించి, నాణ్యత, కొలతలను తనిఖీ చేశారు. ఏటుకూరు చెరువు పరిసరాల్లోకి ఇతరులు రాకుండా గేటు ఏర్పాటు చేయాలని, రిజర్వాయర్ వద్ద ఏర్పాటు చేసిన ఫిల్టర్ బెడ్స్ పనులను త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తేవాలన్నారు. అనంతరం హెడ్ వాటర్‌వర్క్స్‌లో నూతనంగా నిర్మాణం చేసిన సిసి రోడ్ నాణ్యత, కొలతలు, ఫిల్టరేషన్ బెడ్స్‌ని పరిశీలించారు. పర్యటనలో కార్పొరేటర్ దాసరి లక్ష్మీదుర్గ, ఎస్.ఈ భాస్కర్, ఈఈలు కొండారెడ్డి, శాంతిరాజు, డిఈఈలు శివకుమార్, కళ్యాణరావు, ఏఈలు రాంబాబు పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న విసి రాజశేఖర్,తదితరులు

వర్సిటీలో డ్రోన్ టెక్నాలజీ ఇంక్‌బేషన్ సెంటర్

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలోని సివిల్ అండ్ మెకానికల్ బ్లాక్‌లో జస్విద్ క్రయో టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సంహారంతో ఏర్పాటు చేసిన క్లీన్ ఎనర్జీ అండ్ క్లియర్ డిజైన్ ఇంక్ బేషన్స్ సెంటర్‌ను విసి పి. రాజశేఖర్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సదర సంస్థతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. విసిపి రాజశేఖర్ మాట్లాడుతూ జస్విత్ సంస్థ ప్రతినిధులు మన పూర్వ విద్యార్థుల విద్యార్థులు కావడం సంతోషకరం అన్నారు. ఈ సెంటర్‌ను ఉపయోగించుకొని విద్యార్థులు మరింతగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ పి.వరప్రసాద్ మూర్తి, రిజిస్ట్రార్ బి. కరుణ, ఇంజనీరింగ్ కళాశాల డీన్ శ్రీనివాస్ రెడ్డి, ప్రిన్సిపాల్ పి సిద్దయ్య, కో-ఆర్డినేటర్లు పాల్గొన్నారు.



కోటేశ్వరరావును సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

అర్కెస్ట్రా కళాకారుడు కోటేశ్వరరావుకు సత్కారం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

ఎన్టీఆర్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా పట్టణానికి చెందిన ప్రముఖ ఆర్కెస్ట్రా కళాకారుడు కనపర్తి కోటేశ్వరరావును ఉత్సవ కమిటీ సత్కరించింది. స్థానిక బోస్‌రోడ్డులోని పెమ్మసాని థియేటర్‌లో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ సారధ్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఎన్టీఆర్ నటించిన శ్రీనాథ కవిసార్వభౌముడు చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. కళాకారుల సత్కారాల్లో భాగంగా కోటేశ్వరరావును సత్కరించారు. కార్యక్రమంలో పెమ్మసాని పోతురాజు, ఈదర శ్రీనివాసరావు, వి.మల్లిఖార్జునరావు, డి.భాస్కర్, కె.ఏడుకొండలు, నీలాంబరం, భవాని, ఎం.రాఘవరావు, జగన్ పాల్గొన్నారు.

రిటైర్డ్ టీచర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-గుంటూరు : విశ్రాంత ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా సివిఎస్ మణి, కాశీవిశ్వేశ్వరరావు ఎన్నికయ్యారు. జెడ్పి సమావేశ మందిరంలో జరిగిన కార్యవర్గ ఎన్నికలకు ఎన్నికల అధికారిగా విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.నాగరాజు వ్యవహరించారు. అసోసియేసన్ కార్యనిర్వాహక అధ్యక్షులుగా కె.సుధాకర్‌రెడ్డి, కెవివిపి సత్యనారాయణ, ఎం.భారతిలక్ష్మి, అసోసియేట్ అధ్యక్షులుగా ఎ.సత్యనారాయణరెడ్డి, వై.గోపాలరెడ్డి, పి.కస్తూరిబాయి, ఆర్.రామకొండలరావు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా వి.హరిశ్చంద్రుడు, జి.వీరాంజనేయులు, టి.లీలామాధవరావు, బి.పద్మావతమ్మ, బి.భాస్కర్‌రెడ్డి, ఆర్థిక కార్యదర్శిగా విద్యాసాగర్, కార్యదర్శులుగా మరో ఆరుగురు ఎన్నికయ్యారు.



కిట్స్‌లో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి-గుంటూరు : కిట్స్ ఇంజినీరింగ్ కాలేజీలో ముందస్తు సంక్రాంతి వేడుకలు బుధవారం నిర్వహించగా విద్యార్థులు తెలుగు, సంప్రదాయ వస్త్రధారణతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ముగ్గులు, గొబ్బెమ్మలతో కళాశాల ప్రాంగణాన్ని తీర్చిదిద్దారు. తప్పెట్లు, నాట్య ప్రదర్శనలు, విచిత్ర వేషధారణలు అలరించాయి. బొంగరాలు, గోలీ ఆటలు, గాలిపటాలు ఎగురవేసి ఆనందంగా గడిపారు. కళాశాలల ఛైర్మన్ కోయి సుబ్బారావు మాట్లాడుతూ తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత నేటితరంపై ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి కోయి శేఖర్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాబు, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ కె.హరిబాబు, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

నేడు వివిఐటీ విద్యార్థుల దర్గా టు దుర్గ

ప్రజాశక్తి-తెనాలి : పెదకాకాని మండలం నంబూరులోని వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజి కళాశాల ఆధ్వర్యంలో గురువారం 'దర్గా టు దుర్గ' జాతి సమైఖ్యత నడక కార్యక్రమం నిర్వహిస్తామని కళాశాల యాజమాన్యం బుధవారం తెలిపింది. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ప్రతిఏటా నిర్వహిస్తు న్నట్లుగానే ఈ ఏడాదీ 1500 మంది విద్యార్థులతో గుంటూరు నగరంలోని హజరత్ కాలేషా మస్తాన్ దర్గా నుంచి విజయవాడ దుర్గ గుడి వరకూ 33కె వాక్ నిర్వహిస్తామని తెలిపారు.

బొబ్బర తెగులుతో మిర్చిరైతుకు మళ్లీ నష్టం

ప్రభుత్వం ఆదుకోవాలి : రైతు సంఘం

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్ : బొబ్బర తెగులుతో మిర్చిపైరు తీవ్రంగా దెబ్బతిన్నదని, రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు కొత్త వెంకటశివరావు డిమాండ్ చేశారు. మండలంలోని పాలపర్రు, అన్నారం గ్రామాల్లో పొలాలను సంఘం నాయకులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకటశివరావు మాట్లాడుతూ మిర్చి సాగు కోసం రైతులు ఇప్పటి వరకు ఎకరాకు రూ.లక్షన్నర నుండి రూ.2 లక్షల వరకూ ఖర్చు చేశారని, అధిక వర్షాలు, బొబ్బర తెగులు వల్ల పూత, పిందెలు రాలేదని చెప్పారు. గతేడాది అధిక వర్షాలు, తామర తెగులు వల్ల రైతులు భారీగా నష్టపోయారని, అయినా ఎవరికీ బీమా వర్తించలేదని గుర్తు చేశారు. ఈ ఏడాదైనా దెబ్బతిన్న పొలాలను పరిశీలించి బాధిత రైతులకు పరిహారం ఇవ్వాలని కోరారు. పరిశీలనలో నాయకులు డి.రమేష్‌బాబు, జె.రామారావు, సిహెచ్.యానాదులు, డి.శ్రీను, రైతులు పాల్గొన్నారు.



పార్టీలకే కాదు.. ప్రజలకూ ప్రమాదకరమే

- జీవో 1 పై వివిధ పార్టీలు, సంఘాల నాయకులు
- పలుచోట్ల రౌండ్‌టేబుల్ సమావేశాలు
- రద్దు చేసే వరకూ ఉద్యమాలకు తీర్మానాలు

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

భావ ప్రకటన స్వేచ్ఛ కోసం ప్రజలు ఉద్యమించాల్సిన పరిస్థితులను వైసిపి ప్రభుత్వం సృష్టించిందని వివిధ పార్టీలు, సంఘాల నాయకులు మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీవో 1కు వ్యతిరేకంగా స్థానిక సిపిఎం కార్యాలయంలో రౌండ్‌టేబుల్ సమావేశం బుధవారం నిర్వహించారు. సమావేశానికి పౌరహక్కుల సంఘం నాయకులు సిహెచ్.చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు. జీవో రద్దయ్యేంత వరకూ బహుముఖ రూపాల్లో పోరాటానికి కార్యాచరణను ప్రకటించారు. అవసరమైన న్యాయ స్థానాన్నీ ఆశ్రయించాలన్నారు. సెప్టిక్ ట్యాంక్ ప్రమాదంలో మృతుడు అనిల్ కుటుంబానికి న్యాయం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని, అవసరమైతే నిరాహార దీక్ష చేయాలని, స్థానిక మంత్రి అక్రమాలపై విస్తృతంగా ప్రచారం చేయాలని సమావేశం తీర్మానించింది.

ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు గద్దె చలమయ్య మాట్లాడుతూ జీవో 1కి బ్రిటిష్ పాలనను గుర్తుకు తెస్తోందని, అప్రజాస్వామిక పాలనను ప్రశ్నించే వారి గొంతు నొక్కేందుకు ప్రభుత్వం ఈ జీవోను తెచ్చిందని, వీటికి ఇటీవల కొన్ని ఘటనలను సాకుగా చేసుకుందని విమర్శించారు. ఇది రాజకీయ పార్టీలకే ఈ జీవో పరిమితం కాదని, సమస్యలపై ఉద్యమించే ప్రజలందరి హక్కులనూ హరిస్తుందని వివరించారు. కుట్రపూరితంగా తెచ్చిన ఈ జీవో ప్రమాదాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈ జీవోను రద్దు చేసే వరకూ ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సెప్టింక్ ట్యాంక్ ప్రమాదంలో మృతి చెందిన అనిల్ కుటుంబానికి రూ.5 లక్షల చెక్కు రాగా అందులో రూ.2.5 లక్షలు ఇవ్వలేదనే అక్కసుతో బాధిత కుటుంబానికి సాయం దక్కకుండా మంత్రి అంబటి రాంబాబు అడ్డుకున్నారని, చెక్కును వెనక్కు పంపారని విమర్శించారు. బాధితుల పట్ల మంత్రి కక్షసాధింపునకు ఇదొక నిదర్శనమన్నారు. దీంతోపాటు నియోజకవర్గంలో అనేక అవినీతి, అక్రమాలనూ వెలికితీసి ప్రజలకు కరపత్రాల ద్వారా వివరించాలని, మంత్రి చర్యలను ఎండగట్టాలని అన్నారు. సిపిఐ నాయకులు ఎన్.వేణుగోపాల్, టిడిపి నాయకులు ఎ.సాంబయ్య, కాంగ్రెస్ నాయకులు డి.జ్ఞాన్‌రాజ్‌పాల్, బిఎస్‌పి నాయకులు సంగీతరావు తదితరులు మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నిరసనలను అడ్డుకోవడానికే ఈ జీవో అన్నారు. అరాచక పాలనకు ఎవరూ అడ్డు చెప్పకూడదనే ఉద్దేశంతోనే ఈ జీవో తెచ్చి హెచ్చరించినట్లుగా ఉందన్నారు. సమావేశంలో సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్, జనసేన నాయకులు ఆర్.సుమన్, ప్రజా సంఘాల నాయకులు జి.ఉమశ్రీ, డి.విమల, పి.మహేష్. జె.విజయకుమార్, కోటేశ్వరరావు, ఆర్.పురుషోత్తం, ఎం.హరిపోతురాజు, ఎ.ప్రసాదరావు, మృతుడు అనిల్ కుటుంబీకులు పాల్గొన్నారు.



నరసరావుపేట సమావేశంలో మాట్లాడుతున్న వై.గోపాలరావు

ప్రజాశక్తి - నరసరావుపేట

స్థానిక సిపిఐ కార్యాలయంలో నిర్వహించిన అఖిలపక్ష పార్టీల రౌండ్‌టేబుల్ సమావేశానికి సిపిఐ పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శి కె.రాంబాబు అధ్యక్షత వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.గోపాలరావు మాట్లాడుతూ కందుకూరు, గుంటూరు ఘటనల సాకుతో అప్రజాస్వామిక జీవోను ప్రభుత్వం తేవడం దారుణమన్నారు. జంగారెడ్డిగూడెంలో మద్యం తాగి 29 మంది ప్రాణాలు కోల్పోయారని, దీనికి సిఎం ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ అరెస్టులు, గృహ నిర్బంధాలతో గొంతు నొక్కుతున్నారని విమర్శించారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి ఎ.మారుతి వరప్రసాద్, జై భీమ్ భారత్ పార్టీ నాయకులు జి.జాన్‌పాల్ జనసేన నాయకులు షేక్ అదఫ్, ఎంఐఎం పార్టీ జిల్లా నాయకులు మస్తాన్‌వలి, నిరుద్యోగ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు ఎం.శ్రీనివాస్ మాట్లాడారు. వివిధ పార్టీలు, సంఘాల నాయకులు ఎస్.ఆంజనేయనాయక్, కె.రామారావు, డి.శివకుమారి, సుభాని, షేక్ హుస్సేన్, బి.శ్రీనివాసరావు, యు.రాము, షేక్ సుభాని, కె.బ్రహ్మయ్య, శేఖర్, వెంకట్, జి.హర్ష, సామేలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

అరండల్‌పేటలోని అంబేద్కర్ మినీ హాల్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం రజక జన సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. 13న కలెక్టరేట్ వద్ద పెద్ద ఎత్తున నిరసనకు తీర్మానించింది. సామాజిక న్యాయ కేంద్రం రాష్ట్ర కన్వీనర్, ప్రముఖ న్యాయవాది వై.కోటేశ్వరరావు(వైకె) మాట్లాడుతూ జీవోలో నిషేధం మాట వాడకపోయినా నివారించాలని (ఎవాయిడ్) అనే పదం ఉందని, ఇది చాలా కీలకమని వివరించారు. సమావేశంలో వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

జగనన్న తోడు 6వ విడత పంపిణీ

గుంటూరు జిల్లాలో 16195 మందికి, పల్నాడు జిల్లాలో 3,213 మందికి లబ్ధి

రెండు జిల్లాల్లో 58,096 మందికి వడ్డీ రాయితీ

ప్రజాశక్తి-గుంటూరు, పల్నాడు జిల్లా

తోపుడుబండ్లు, ద్విచక్రవాహనాలు, ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు చేసేవారికి, హస్తకళలపై ఆధారపడే చిరు వ్యాపారులు వారి వ్యాపారాభివద్ధికి అధిక వడ్డీలకు అప్పులు చేయకుండా ప్రభుత్వం జగనన్న తోడు పథకం ద్వారా వడ్డీ లేని రుణాలు అందిస్తున్నదని గుంటూరు, పల్నాడు జిల్లాల కలెక్టర్లు ఎం.వేణుగోపాల్ రెడ్డి, ఎల్.శివశంకర్ అన్నారు. బుధవారం సిఎం క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న తోడు 6వ విడత రుణ మంజూరు, వడ్డీ రాయితీని ఆన్‌లైన్ ద్వారా విడుదల చేశారు. కార్యక్రమంలో కలెక్టరేట్ల నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. గుంటూరు జిల్లాలో ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున 16195 మందికి రూ.16.20 కోట్లు, 32,783 మందికి రూ.82 లక్షల వడ్డీ రాయితీని జమ చేసినట్లు, పల్నాడు జిల్లాలో 3,213 మంది 1,32,13,000, వడ్డీ రాయితీ కింద 25,313 మందికి రూ.60.87 లక్షలు జమ చేసినట్లు కలెక్టర్లు తెలిపారు. కార్యక్రమంలో గుంటూరు కలెక్టరేట్ నుండి కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, జెడ్పి ఛైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, ఎమ్మెల్యేలు మద్దాళి గిరిధర్, మహమ్మద్ ముస్తఫా, డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి, రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల సహాయ కార్పొరేషన్ ఛైర్ పర్సన్ ముంతాజ్ పఠాన్, రాష్ట్ర కృష్ణ బలిజ, పూసల కార్పొరేషన్ ఛైర్ పర్సన్ కోలా భవానీ మణికంఠ, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ బత్తుల దేవానంద్, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, మెప్మా పీడీ పి.వెంకట నారాయణ, లబ్ధిదారులు పాల్గొన్నారు.



గుంటూరులో లబ్ధిదార్లకు మెగా చెక్కును అందిస్తున్న కలెక్టర్ తదితరులు, లబ్ధిదార్లతో పల్నాడు జిల్లా కలెక్టర్



పోటీలను ప్రారంభిస్తున్న ఘట్టమనేని సాయిరేవతి

ఆసక్తి ఉంటే శిక్షణివ్వడానికి సిద్ధం

విద్యార్థినీ విద్యార్థులతో వెయిట్ లిఫ్టర్ సాయిరేవతి

సంక్రాంతి క్రీడా పోటీలకు ప్రారంభోత్సవం

ప్రజాశక్తి - దుగ్గిరాల

కామన్వెల్త్ క్రీడల్లో మూడు బంగారు పథకాలతో పాటు మొత్తం 70 బంగారు పతకాలు సాధించానని, మీరు కూడా పతకాలు సాధించడానికి కృషి చేయాలని విద్యార్థులతో వెయిట్ లిఫ్టర్ ఘట్టమనేని సాయిరేవతి అన్నారు. సంక్రాంతి సందర్భంగా మండల కేంద్రమైన దుగ్గిరాలలోని కొత్త రఘురామయ్య డిగ్రీ కాలేజీలో దోస్త్ సంస్థ ఆధ్వర్యంలో క్రీడా పోటీలను సాయిరేవతి బుధవారం ప్రారంభించి మాట్లాడారు. తాను తెనాలిలోని క్విక్ జిమ్ లో 20 మందికి శిక్షణివ్వగా చాలామంది బంగారు పతకాలు సాధించారని చెప్పారు. ఇక్కడి విద్యార్థులూ శిక్షణ పొందేటట్టయితే తాను ప్రతిరోజూ సాయంత్రం రెండు గంటలపాటు శిక్షణివ్వడానికి సిద్ధమని చెప్పారు. తాను ఈ స్థాయికి రావడానికి సాయపడిన వారిని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఇదిలా ఉండగా పోటీల్లో మండలంలోని వివిధ పాఠశాలల నుండి 600 మంది విద్యార్థిని, విద్యార్థులు వాలీబాల్, కబడ్డీ రన్నింగ్‌తో, వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో పాల్గొన్నారు. ఎస్ఐ ఎ.శ్రీనివాస్‌రెడ్డి, ఎన్.నాగేశ్వరావు, సాల్మన్‌రాజు, టి.జాన్సన్, చంటి, కోటియాదవ్, ముత్యం, లంక టైగర్, కీర్తి, పవన్, జె.కావ్య పాల్గొన్నారు.